TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేదికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబందిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 17 | ఎడిటర్ : కందాడి మహేందర్ రెడ్డి | గురువారం, జూన్,18, 2026 | పేజీలు : 8 | వెల : రూ.4/-

## ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో

# మాణిక్యాలను వెలికితీస్తాం

- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం
- విద్యారంగానికి రూ.27 వేల కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడి
- త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

### విద్యతోనే జీవితాల్లో మార్పు.. ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు: రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్17,**

తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు.రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు. దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న



లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. 'నో అడ్మిషన్స్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు.

## కాగితాలపై కాదు

# క్షేత్రస్థాయిలో చూపించాలి

- తెలంగాణ పరిధిలో ముంపు ప్రాంతాలను ఆదుకుంటామన్న పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ
- పీపీఏ రక్షణ హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్న హరీశ్ రావు
- ఇచ్చిన హామీ ఫైళ్లకే పరిమితం కాకుండా చూడాలని విన్నపం
- పోలవరం ముంపుపై కేంద్రం కీలక లేఖ..



**హైదరాబాద్,జూన్17,**

తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ (వెనక్కి తన్నే నీరు) ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ' సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు.పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస-పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం.2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది. తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది.ఈ నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం ముంపు ఆందోళనలను అధికారికంగా గుర్తించి, రక్షణకు హామీ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. అయితే, ఈ హామీలు కేవలం ఆఫీసు ఫైళ్లకే పరిమితం కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో సకాలంలో అమలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రజల భద్రత, రైతుల ఉపాధి విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం, పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు కలిసి సమన్వయంతో వ్యవహరించి, ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## వితంతువులకు గుడ్ న్యూస్ చెప్పిన

# ఏపీ ప్రభుత్వం

- కొత్తగా 2.20 లక్షల మంది వితంతువులకు పింఛన్లు
- ప్రతి నెలా రూ. 4 వేల పింఛన్
- మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నామన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి,జూన్17,**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వితంతు మహిళలకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో త్వరలోనే కొత్తగా 2.20 లక్షల మందికి వితంతు పింఛన్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. అర్హులైన మహిళలకు రాబోయే ఒకటి రెండు నెలల్లో ప్రతి నెలా రూ. 4 వేల చొప్పున పింఛను అందించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ఏపీలో ప్రస్తుతం 62.34 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం ఏటా రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అని స్పష్టం చేశారు. పింఛను తీసుకునే భర్త చనిపోతే, భార్యకు తక్షణమే 'స్పౌజ్ కేటగిరీ' కింద పెన్షన్ బదిలీ చేస్తున్నామని, దీనివల్ల ఇప్పటికే 2.45 లక్షల మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు.

## మంగళగిరి-తాడేపల్లికి

# మహర్దశ

- మంత్రులు లోకేశ్, పెమ్మసాని చేతుల మీదుగా పనులకు శ్రీకారం
- రూ.1,167 కోట్ల భారీ వ్యయంతో రెండు దశల్లో నిర్మాణం
- 531 కి.మీ.ల పైప్‌లైన్, 20 మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు

**అమరావతి,జూన్17**



మంగళగిరి నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తీవ్రమైన మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) పరిధిలో సుమారు రూ.1,167 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు.

## నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం

# స్ఫూర్తిదాయకం

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- హనుమకొండ పర్యటనకు సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**హనుమకొండ, జూన్17,**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన ఈరోజు వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు.

## కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో

# రాజీపడే ప్రసక్తే లేదు

- బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను మూసేశానని వ్యాఖ్య
- తన కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'తోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్న కవిత



**హైదరాబాద్,జూన్17,**

తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావుతో గానీ, ఆ పార్టీతో గానీ తిరిగి కలిసే ప్రసక్తే లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను ఇప్పటికే పూర్తిగా మూసేశానని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ద్వారానే సరికొత్త చరిత్రను లిఖిస్తానని ఆమె ఉద్ఘాటించారు.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కవిత, ఒకవేళ కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చారు. "ఖచ్చితంగా ఆ అధ్యాయం ముగిసింది. జీవితంలో కొన్నిసార్లు పేజీలు తిప్పాలి, మరికొన్నిసార్లు పుస్తకాలనే మూసివేయాలి.

# వరి సాగు తగ్గించండి

### పరిస్థితి అనుకూలంగా ఉండకపోవచ్చు : తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జూన్17**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో వర్షాలు కాస్త తగ్గే సూచనలు ఉన్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును కాస్త తగ్గించి, మంచి లాభాలనిచ్చే ఆయిల్‌పామ్ వైపు దృష్టి పెట్టాలని రైతులను ఆయన కోరారు.



# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

### గోవా నెట్‌వర్క్‌ను ఛేదించిన ఈగిల్, టాలీవుడ్‌కు లింకులు!

**హైదరాబాద్,జూన్17,**

గోవా కేంద్రంగా హైదరాబాద్‌కు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న భారీ నెట్‌వర్క్‌ను తెలంగాణ 'ఈగిల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) దళాలు ఛేదించాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా 19 మంది డ్రగ్స్ వినియోగదారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దందాలో టాలీవుడ్ వర్గాలకు కూడా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో తీవ్ర కలకలం రేగుతోంది.



# కేసీఆర్ చెప్పేవరకు లక్ష్మీదేవి పల్లె ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ కు తెలుసా?

- 90 శాతం పనులు పూర్తయిన పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ పార్టీ మాట్లాడడం హాస్యాస్పదం
- నాడు లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన నేతలు, నేడు ఆ ప్రాజెక్టును కడ్తామని చెప్పుతున్నారు
- రైతుబంధు పథకాన్ని పూర్తిస్థాయిలో నీరుగార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? కాంగ్రెస్ ఇస్తామన్న తులం బంగారం ఎక్కడికి పాయే?
- కేసీఆర్ పాలనలో రైతులు, సకలజనులు సంతోషంగా ఉన్నారు సభ్యత్వ నమోదులో పార్టీ శ్రేణులు ఆసక్తిగా పాల్గొనాలి
- ాx= ఓటర్ జాబితా సవరణపై ప్రతి కార్యకర్తబీఅప్రమత్తంగా ఉండాలి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- షాద్ నగర్ కుంట్ల రాం రెడ్డి గార్డెన్ లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య
- అతిథిగాపాల్గొన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బైకని శ్రీనివాస్ యాదవ్



**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్17:**కేసీఆర్ పాలనలో సకలజనులు సంతోషంగా ఉన్నారని , రైతుల శ్రేయసే లక్ష్యంగా ఎన్నో రిజర్వాయర్లు నిర్మించి బీడు భూములకు సాగునీళ్లు అందించిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ాx= అవగాహన, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ పట్టణంలోని కుంట్ల రాంరెడ్డి గార్డెన్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి , సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బైకని శ్రీనివాస్ యాదవ్ లతో కలిసి మాట్లాడారు. పాలమూరు ప్రజల శ్రేయస్సు కోసం నాటి సీఎం కేసీఆర్ పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఐదు ప్రధాన రిజర్వాయర్లను నిర్మించి 90 శాతం మేర పనులు పూర్తి చేస్తే, పనులు చేయలేదంటూ కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. కేసీఆర్ చెప్పేంతవరకు లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు కట్టాలని సోయి కాంగ్రెస్ పార్టీకి ఉన్నదా? ఆ ప్రాంతం పేరు అయినా తెలుసా? అంటూ విమర్శించారు. లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆనాటి కాంగ్రెస్ నేతలు నేడు ప్రాజెక్టు కడతామని చెప్పడం విడ్డూరంగా ఉందని, నిజంగానే రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వెంటనే పూర్తి చేసి పాలమూరు జిల్లా రైతులకు సాగునీరు అందించాలని సవాలు విసిరారు. కేసీఆర్ పాలనలో సకలజనులు సంతోషంగా ఉన్నారని,అన్ని రంగాలు అభివృద్ధి చెందాయని,ఇందులో భాగంగానే రైతుల బాగు కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి పెట్టుబడి సహాయం అందిస్తే,నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధును నీరుగార్చి రైతులను హరిగోస పెడుతుందని తీవ్రస్థాయిలో విమర్శించారు. సకాలంలో రైతుబంధు నిధులు వేయకుండా రైతులను ఇబ్బందుల గురి చేస్తుందని, వర్షాకాలం ప్రారంభమైన నేటికి రైతుబంధులు ఇవ్వలేదని మండిపడ్డారు. నాటి కేసీఆర్ పేద ప్రజల పెళ్లిల కోసం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ వంటి ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రవేశపెట్టి యువతులకు నిధులు అందజేస్తే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం నిధులను కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న తులం బంగారం ఎక్కడ పోయిందని ఎద్దేవా చేశారు . అన్ని వర్గాల ప్రజలు మరో మరో కేసీఆర్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని



గుర్తు చేశారు . అదేవిధంగా ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు వచ్చే బీఎల్వోల తో బూతు స్థాయి కార్యకర్తలను సమన్వయం చేసుకొని దొంగ ఓట్లను తొలగించాలని, అసలైన ఓట్లను నమోదు చేయాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సభ్యత నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, అన్ని వర్గాల కార్యకర్తలు నాయకులు పార్టీ సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొని రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదును చేయాలని సూచించారు. డిజిటల్ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకునే ప్రతి వ్యక్తి ఫోటోలు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని ప్రత్యేకంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణి దేవి, సభ్యత్వ నమోదు ఇంచార్జీ బైకని శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ సహకార కార్పొరేషన్ చైర్మన్ రాజవరప్రసాద్, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లెల వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్లు నరేందర్, లావణ్య దేవేందర్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు నటరాజన్, శ్రీధర్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, హఫీజ్, పద్మా రెడ్డి, మురళీధర్ రెడ్డి, మెండే కృష్ణ, మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ లైబ్రరీ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ హోదాలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**- ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం -- ఎమ్మెల్యే కోరం కనకయ్య**



రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను సులభంగా బుక్ చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం టేకులపల్లి మండలంలోని బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ప్రస్తుతం 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. యూరియాను అవసరానికి మించి వినియోగించడం వల్ల భూసార సాంద్రత తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో అధిక మొత్తంలో ఎరువులు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో మొక్కజొన్న సాగు జరిగిందని, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల వైవిధ్యీకరణ, పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. టేకులపల్లి మండలంలో ఐదు రైతు వేదికల ద్వారా యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 18001237157 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత సీజన్‌లో రికార్డు స్థాయిలో మొక్కజొన్నను 2400 మద్దతు ధరకు కొనుగోలు చేసి, 1800 కు ప్రభుత్వం విక్రయించిందని నష్టాన్ని ప్రభుత్వమే భరించి రైతులకు అండగా నిలిచినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వంపై కొందరు తప్పుడు ప్రచారాలు చేపడుతున్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు ఇంటి నుంచే యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించడం కూడా అందులో భాగమేనన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలను సాగు



చేస్తూ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు యూరియా బస్తాలను జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా అందజేశారు. టేకులపల్లి పర్యటనలో భాగంగా ఏ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు ధారావత్ చుక్కి, భర్త టిక్లీ నిర్మిస్తున్న ఇంటిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతి, నిధుల విడుదల తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ లక్కినేని సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ బోడ బాలు, కొత్తగూడెం ఆర్డీఓ మధు, సహకార శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**ఖానాపురం జూన్ 17 (నమస్తే భారత్ ) :** ఖానాపురం మండల కేంద్రంలో యాదవ కుల బాంధవుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సోనబోయిన స్వామి తన స్వంత స్థలంను వితరణ చేశాడు. అర్చకులు పర్వతపు శివప్రసాద్ శాస్త్రి వేద మంత్రాలతో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. యాదవ కుల పెద్దమనిషి జక్కుల సాయిలు, యాదవ కుల సంఘం గౌరవ అధ్యక్షుడు నూనెల కుమార స్వామి, అధ్యక్షుడు తోటకూరి రాజు, ఉపాధ్యక్షుడు భూష బోయిన శ్రవణ్, మరియు గ్రామంలోని వివిధ కుల సంఘాల పెద్దమనుషులు కోయగూరి కుమారస్వామి, ఉప్పు రాజు, వీరమల్ల శ్రీను, రెడ్డి నాగార్జున రెడ్డి, మల్యాల పోశెట్టి, గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, ఏ ఎం సి వైస్ చైర్మన్, శాఖమూరి హరిబాబు, ఆత్మ డివిజన్ చైర్మన్ యడ్ల బిక్షం రెడ్డి,మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ సర్పంచ్ పరుచూరి సుబ్బారావు, వార్డు సభ్యులు వేములపల్లి వెంకట ప్రసాద్ రావు, శాఖమూరి ముఖేష్ చౌదరి, మచ్చిక అశోక్ గౌడ్ యాదవ కుల బాంధవులు, సంఘ బాధ్యులు తోటకూరికుమారస్వామి ,జుర్రు యాకయ్య, తొట్ల సాంబయ్య, జటంగి పెద్ద కుమార్, జటంగి చిన్న కుమార్, భూష బోయిన నాగయ్య, వీరబోయిన ముత్యాలు, మారబోయిన రాజేందర్, చిన్నాల సారంగం, నూనెల కొమ్మాలు, వీరబోయిన గంగయ్య, రాజ బోయిన రాజు, లక్ష్మణ్, రఘు, భూష బోయిన అయిల్ మల్లు, స్వామి, సోనబోయిన వినీల్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రతుకుదెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి.బ్రతుకులనే బలితీసుకుంటోంది

**- గోపా డివిజన్ అధ్యక్షులు - వేముల మల్లేశం, భాదిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా వెంటనే అందించాలి - సమ్మిగౌడ్ - 3 రోజుల్లో ముగ్గురు గౌడన్నల బ్రతుకుల్లో విషాదం బాధాకరం - సమ్మిగౌడ్ చిలువేరు - ఇంటావిడ తాళి చేతిలో పట్టుకొని గౌడన్న కోసం ఎదురుచూపు నరకం - కేజీకేస్ మోడెం వెంకటేశ్వర్లు**



**నమస్తే భారత్ :**-కేసముద్రం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో వరుసగా జరుగుతున్న గీత కార్మికుల ప్రమాదాలు గౌడ కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతుకుదెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి నేడు బ్రతుకులనే బలి తీసుకుంటోందని అన్నారు. కుటుంబ పోషణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్లను నమ్ముకొని జీవనం సాగిస్తున్న గౌడన్నలు అదే తాటి చెట్ల కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం అత్యంత.బాధాకరమన్నారు. తమ భర్తలు పొద్దున వృత్తి రీత్యా బయటకు వెళ్లిన వాళ్ళు తిరిగి నవ్వుతూ ఇంటికి వచ్చే వరకు తాళి చేతిలో పట్టుకొని చూసే వాళ్ళ ఎదురుచూపులు మాటల్లో వర్ణించిలేనివని ఆవేదన వ్యక్తం చేసారు. గత కొద్ది రోజుల వ్యవధిలోనే కేసముద్రం మండలంలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయన్నారు. కేసముద్రం గ్రామానికి చెందిన ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టిందని, చేతులు, కాళు విరిగిపోయి ప్రస్తుతం హన్మకొండలోని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అలాగే ఇంటికన్నె గ్రామానికి చెందిన సార రాజు తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో వెన్నెముక, పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నారని అన్నారు. ఇక తాజాగా కల్వల గ్రామానికి చెందిన వేముల మల్లేశం తాటిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందడం గౌడ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న చిలువేరు సమ్మయ్య గౌడ్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన ఆయన, పంచనామా ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబ పోషణ కోసం పనికి వెళ్లిన వ్యక్తి తిరిగి శవంగా ఇంటికి చేరడం హృదయ విదారకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్, మోడెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,ఉదయం కుటుంబం కోసం పనికి వెళ్లిన గౌడన్న సాయంత్రానికి క్షేమంగా ఇంటికి చేరుతాడో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి ఇచ్చిన తాటి చెట్టును నమ్ముకొని తరతరాలుగా జీవిస్తున్న గౌడన్నలు, నేడు అదే తాటి చెట్లపై ప్రాణాలు కోల్పోతున్నారు. పూట గడవాలంటే చెట్టు ఎక్కాలి. ప్రాణం దక్కాలంటే అదృష్టం ఉండాలి అనే పరిస్థితి గౌడ కుటుంబాలను వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు..మృతి చెందిన వేముల మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కొరారు.. అలాగే ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ మరియు సార రాజులకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా తోపాటు వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వం భరించి మెరుగైన వైద్యం అందించాలని. కోరారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి గీత కార్మికుడికి నాణ్యమైన సేఫ్టీ బెల్టులు, భద్రతా పరికరాలు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా అందించాలని డిమాండ్.చేశారు. తాటి చెట్లు ఎక్కే కార్మికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. తాటి చెట్ల ఎత్తును తగ్గించే విధానాలతో పాటు ఆధునిక గీత పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. గౌడ సంఘం తరఫున గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి గీత కార్మికుడు భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా చైతన్యం తీసుకువస్తామని చిలువేరు సమ్మయ్య గౌడ్ తెలిపారు. గౌడ కుటుంబాల భద్రత కోసం సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

## ఖానాపురంలో జమ్మి మొక్క ప్రతిష్టాపన చేసిన సర్పంచ్



**ఖానాపురం జూన్ 17( నమస్తే భారత్ ) :** ఖానాపురం మండల కేంద్రం ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఖానాపురం రైతు వేదిక వద్ద "జమ్మి మొక్క" ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా శమీ వృక్షం ప్రాధాన్యతను గుర్తుచేశారు. జమ్మి చెట్టు మన సంస్కృతికి, ఆచారాలకు ప్రతీక. శ్రీరాముడు అజ్ఞాతవాసం వెళ్లే ముందు, పాండవులు అజ్ఞాతవాస ఆయుధాలను దాచింది జమ్మి చెట్టు కిందనేనన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. హరితహారం లక్ష్యసాధనకు ఇది మనందరి బాధ్యత" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు వేములపల్లి వెంకట ప్రసాద్ రావు,గుండ్లపల్లి విజయ్, చలిగంటి మల్లికార్జున్,గ్రామ పెద్దలు బొబ్బ విద్యాసాగర్ రావు,బోడ దేవా, మచ్చిక అశోక్, నంద్యాల వినయ్ రెడ్డి, రెడ్డి నాగార్జున రెడ్డి, మేడిద కుమార్, కోయగూర కుమార స్వామి, వేముల వెంకటేశ్వర రావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు,మర్రి రామస్వామి, పరుచూరి నరేంద్ర, వీరమళ్ళ శ్రీనివాస్, యాకయ్య, మల్యాల పోశెట్టి, భూక్య నవీన్, పల్నాటి శ్రీనివాస్,దాసి శ్రీనివాస్, యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని మొక్కకు నీళ్లు పోశారు.

# అనారోగ్యంతో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**నమస్తే భారత్ భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో** (మూర్తి)జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వరస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ మహమూద్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో చెక్కు రూపంలో లక్ష నగదును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం తరఫున మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో మంజ్యా నాయక్, పోలీస్ అధికారుల సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా ?

అంబేడ్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిడిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేడ్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగం లో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాద్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్దతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవర ణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవ ర్గాల పునర్విభజనను 2029 సార్వత్రక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకేచట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్‌అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్దంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

# 22 శాతం మందికే లక్ష పైన ఆదాయం

## ప్రైవేటులో అగ్రవర్ణాల చదువులు.. ప్రభుత్వ బడుల్లో ఎస్సీ ఎస్టీలు



హైదరాబాద్: తెలంగాణలో కులగణన రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని 78 శాతం కుటుంబాలకు ఆదాయం ఏడాదికి రూ.లక్ష కంటే తక్కువగానే ఉందని తెలిపింది. అదే సమయంలో తెలంగాణలోని ఎస్సీ,ఎస్టీ వర్గాలు.. అగ్రవర్ణాల కంటే3 రెట్లు వెనుకబడి ఉన్నాయని తేలింది. అదే సమయంలో మొత్తం 242 కులాలు ఉండగా.. అందులో 135 కులాలను అత్యంత వెనుకబ డినవిగా గుర్తించారు.తెలం గాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమం లోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుకబడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది. ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది.మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం.. ఎస్సీల్లో 97 శాతం..బీసీల్లో 71శాతం మంది ప్రజలు..తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుక బడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి.

ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కు వగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహిర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది.అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారని పేర్కొంది. ఇక అగ్రవర్ణాల్లో కూడా దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణా లకు చెందిన వారేకావడం గమనార్హం..సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు విద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు ముందంజలో ఉండగా.. ఎస్టీలు 36 శాతానికే పరిమితమయ్యారు.




# ముందుచూపు

భగభగమండే ఎండల తరువాత మొదలయ్యే ఖరీఫ్ కాలం... అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా మామూలే! విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి ... తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇందులో సాగునీటికి అవసరమైన వర్షాలు తప్ప మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందుచూపుతో ముడిపడి ఉన్నవే! అయినా, ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వహించటం వల్ల, ముందస్తుగా అవసరమైనన్ని విత్తనాలూ, ఎరువులూ సమకూర్చకపోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురై, గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా వస్తోంది. పుండు మీద కారం చల్లినట్టు– ఈసారి ఈ కష్టాలన్నింటికీ తోడు ఒకవైపు అమెరికా యుద్ధోన్మాద పర్యవసానం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఈపాటికే హెచ్చరించింది. ఈ కారణాలను సాకుగా చూపించి, చేతులు ఎత్తేయకుండా– ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకులు తమ తక్షణ కర్తవ్యంగా పెట్టుకోవాలి.

చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం మరొక శరాఘాతం. ఏటా 600 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను మనదేశంలో ఉపయోగిస్తున్నారు. ఇందులో అత్యధికం మనదేశంలోనే తయారవుతున్నప్పటికీ– ముడిసరుకుల కోసం దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప– అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోయి, కష్టకాలం దాపురించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే – జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. సాగుకు అవసరమైన సరంజామాను సమకూర్చాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. మే 15 నాటికే కాలువల్లో నీరు విడుదల చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అయితే, పొలాలకు ముందుగా నీరివ్వటంతోనే సరిపోదు. అంతకన్నా ముందుగానే అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. నీటిఎద్దడి పరిస్థితి ఎదురైతే– ఏం చేయాలో అవసరమైన సన్నాహాలు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూల తలు పొటమరిస్తున్న వేళ ... పాలకులు ప్రదర్శించే ముందుచూపే రైతాంగానికి రక్ష. అయితే, అది మాటలకు, ప్రకటనలకు పరిమితం కాకుండా ఆచరణలో చూపటం నేడు చాలా అవసరం.

# రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే చరిత్ర క్షమించదు




రాష్ట్రంలో మన భారత రాజ్యాంగ పీఠిక అభాసు పాలవుతున్నది. పౌరుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వేదన కలిగిస్తున్నది. బాధ్యతాయుత ప్రభుత్వం చేయాల్సిన పని ఇలా కానే కాదు. రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలన కాళరాత్రులను ప్రజల జీవితాల్లోకి ప్రవహింప చేస్తున్నది. చట్టం ముందు అందర్నీ సమానంగా చూస్తామని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పిస్తామని ప్రమాణం చేసిన నాయకులు వాటిని గాలికొదిలేస్తున్నరు. ఎవ్వరూ చెప్పినా.. ఎంత చెప్పినా.. ప్రజల గగ్గోలు పెడుతున్నా... గోడు గోడమని గోస పడుతున్నా కనీసం కనికరించడం లేదు. ఎప్పుడు ఎవరి ఇండ్లు కూల్చేస్తారో తెలియదు. ఎప్పుడు ఎక్కడ హైడ్రాపేరుతో బుల్డొజర్లు వస్తాయో తెలియని భయానక వాతావరణం నేడు రాష్ట్రంలో కన్పిస్తూ ఉన్నది. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రజల ముందు ఉంచింది. ఏడో గ్యారెంటీగా భావప్రకటనా స్వేచ్ఛను కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ప్రజల ఆస్తులు కూలుస్తామని ఎనిమిదో గ్యారెంటీని చెప్పకుండా దాచుకున్నది. ఇప్పుడు తమ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నదనే అనుమానం ప్రజల్లో కలిగేలా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ వ్యవహార శైలి గురించి మరింత నిర్దుష్టంగా చెప్పాలంటే భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హామీ అయిన ఆర్టికల్ 19, 21తో పాటు చట్టబద్ధమైన ఆస్తి హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నది. తమ జీవన భద్రతకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. 1973లో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. అదే కేశవానంద భారతీ కేసుగా చరిత్రకెక్కింది. పౌరుల హక్కుల కంటే పార్లమెంట్, అసెంబ్లీ చేసిన చట్టాలు మహోన్నతమైనవి ఏమీ కాదని చెప్పింది. హైడ్రాపై అసెంబ్లీ ఆమోదముద్ర వేయించుకున్నంత మాత్రాన ప్రజల ఆస్తులను, వారి గౌరవ ప్రదమైన జీవితాలను ధ్వంసం చేసేహక్కు చట్టసభలకు ఉంటుందా? ప్రజల జీవితాలకు రక్షణ లేకుండా చేయాలని చట్టాలు చెప్తున్నాయా.? ప్రభుత్వం వహరిస్తున్న తీరు ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధం కాదా? 1960–80 మధ్య కాలంలో భారత రాజ్యాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న సందర్భం. ఎస్ఆర్ బొమ్మై కేసు, కేశవానంద భారతి కేసుతోపాటు చాలా కేసుల్లో న్యాయస్థానాలు చొరవ తీసుకోవడం వల్ల భారత ప్రజాస్వామ్య సజీవతకు బీజం పడింది. అంతేకాదు పౌరులు గౌరవప్రదంగా, నిర్భయంగా జీవించే ధైర్యాన్ని కూడా న్యాయ స్థానాలు కల్పించాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కోర్టులు మొట్టికాయలు వేసినా తన తీరు మార్చుకోవడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే కూల్చివేతలు మొదలు పెట్టింది. ఇది ఇటీవల పరాకాష్టకు చేరింది. ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న వెలుగుమట్లలో పేదలకు చెందిన వందలాది నివాసాలను ధ్వంసం చేసింది. ప్రజల పట్ల ప్రేమ లేకపోవడమే ఇందుకు కారణమా? లేకపోతే చట్టాల పట్ల గౌరవం లేకపోడమే కారణమా? తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నారా? కాంగ్రెస్ పార్టీ తమది ప్రజాస్వామ్యయుత నేపథ్యం అని చెప్పకుంటుంది. కానీ చర్యలు మాత్రం దానికి భిన్నంగా ఉంటాయి. భవిష్యత్తు అభివృద్ధి కోసమని గడిచిన ఏడు దశాబ్దాలుగా ఇక్కడి పేదలకు జీవనాధారమైన భూములు కోల్పోయారు. ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక్కడి వారు మాత్రం మౌలిక సదుపాయాల కోసమని, నైట్‌మార్కెట్ కోసమని నివాసాలను, భూములను కోల్పోతున్నారు. మన రాజ్యాంగం ఇచ్చిన హామీ ప్రకారం ఎవరైనా ఎక్కడైనా జీవించొచ్చు, వ్యా పారాలు చేసుకోవచ్చు. నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఇతరుల కోసం తరాలకు తరాలు ఆస్తులు కోల్పోవడాన్ని రాజ్యాంగం సమర్థిస్తుందా? ఇక్కడి పేదలను నిలువునా ముంచుతామని అంటే నిర్దేశిత చట్ట నియామాలు మౌనంగా ఉంటాయా? ఎలాంటి అభివృద్ధి అయినా సరే విధ్వంసం, విస్తాపనకు ప్రత్యామ్నాయాలు లేనే లేవా? ఈ తీరులో పాలకులు ఎందుకు ఆలోచించడం లేదు? మూసీ సుందీకరణ కోసం సుమారు యాభై కిలోమీటర్ల మేర లక్షలాది నివాసాలను ధ్వంసం చేస్తామని అంటే ఎట్లా ఊరుకోవాలి? చిన్నచిన్న పనులు చేసుకొని పొట్ట పోసుకుంటున్న బడుగు జీవుల గూళ్లను చెదరగొడ్తామంటే ఎట్లా? మధ్యతరగతి వారి జీవితపు కలం సొంత ఇల్లు. బ్యాంకు లోన్లు తీసుకొని ఏండ్లకు ఏండ్లు కిస్తీలు కట్టుకుంటున్న వారి ఆశలను అడియాశలు చేస్తామంటే ఎట్లా? ప్రైవేటు రంగంలో జీవన భద్రతకు గ్యారెంటీ లేదు. అప్పుల మధ్యనే జీవితం సాగుతూ ఉంటుంది. అలాంటి వారికి రేపటి నుంచే మీ ఇండ్లు ఉండవు పోండి! అంటే వారు ఎక్కడ తలదాచుకోవాలి? జీవితం అల్లకల్లోలం అవుతున్నట్టే కదా?తాజాగా సంగారెడ్డిలో హైడ్రా కూల్చివేతల గురించి మీడియాలో వీడియోలుచూస్తే భయాందోళనలు కలుగుతున్నాయి. కూల్చే యంత్రానికి హృదయం లేదు. కానీ పైనుంచి ఆదేశాలిచ్చే వారికి, వాటిని అమలు చేసే వారికి హృదయం ఉంటుంది కదా? అది పనిచేయడం లేదు ఎందుకు? లేకపోతే అధికారానికి కండ్లు ఉండవు, సంపదకు ఆత్మ ఉండదనే నానుడిని నిజం చేస్తున్నారా? ఎవరెట్లా అనుకున్నా తాము అనుకున్న విధంగా ముందుకెళ్తామనే ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారా? కాంగ్రెస్ పాలనలో కూల్చడం తప్పా నిర్మించడం ఎక్కడైనా ఉన్నదా? కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమున్నదని భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. అంతా తమ ఇష్టం అనే భావనతో పాలకులు ఉంటే గనుక ముమ్మాటికీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్టే, పౌరుల జీవన భద్రతను గాలికి వదిలేసినట్టే.. భారత రాజ్యాంగ పీఠికకు తూట్లు పొడుస్తున్నట్టే. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలక పెద్దలు తప్పును సరిచేసుకోకుంటే చరిత్ర అస్సలు క్షమించదు.

## కలిపి తీసుకుంటే కష్టమే!



మాంసాహారం, పాలు ఒకేసారి తీసుకోవద్దని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం మాంసాహారం-పాలను 'విరుద్ధ ఆహారం'గా పిలుస్తారట. అందుకే, ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే లేనిపోని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తు న్నారు. ఇందుకు కారణాలు చెబుతూ.. మాంసం వేడిచేసే గుణాన్ని కలిగి ఉంటుంది. పాలు చలువ చేస్తాయి. కాబట్టి, ఈ రెండూ కలిపి తీసుకున్నప్పుడు జీర్ణ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా.. పాలు, మాంసంలో ప్రొటీన్స్, పోషకాలు రెండూ అధిక మొత్తంలో ఉంటాయి. కాబట్టి, ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల.. జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. కడుపు ఉబ్బరం, అజీర్ణం, కడుపు నొప్పి, వికారం లాంటి సమస్యలు ఎదురవుతాయని అంటున్నారు. కొందరిలో గుండెల్లో మంట కూడా వస్తుందట. కాబట్టి, మాంసాహారం తిన్న తర్వాత కనీసం 2నుంచి 3 గంటల విరామం ఇచ్చిన తర్వాతే పాలు తాగడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక చేపలు తిన్న తర్వాత పాలుతాగితే.. తీవ్రమైన అలర్జీలు వచ్చేఅవకాశంఉందని అంటున్నారు.


# నెలల శిశువుకు కడుపునొప్పి వస్తుందా?

మా పాపకు రెండున్నర నెలలు. చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఐదున్నర కిలోల బరువు ఉంది. తల్లి పాలే పడుతున్నాం. పాప మల విసర్జన సరిగా లేదు. పోయిన వారంలో నాలుగు రోజుల తర్వాత విరేచనం అయింది. అయిదు రోజులు గడిచినా ఈ వారంలో ఇంకా విరేచనం కాలేదు. పిల్లల డాక్టర్‌కి చూపిస్తే.. కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. రెండు రకాల ఓరల్ డ్రాప్స్ (చుక్కల మందు) ఇచ్చారు. పాలు ఎక్కువగా తాగకుండా చూసుకోమని సలహా ఇచ్చారు. ఆ మందులు వాడిన మరుసటి రోజు కూడా మోషన్ కాలేదు. అప్పుడప్పుడూ ఏడుస్తున్నది. కడుపు నొప్పితో ఏడుస్తుందేమోనని అనుకుంటున్నాం. అడపాదడపా పాలు తాగిన తర్వాత వాంతి చేసుకుంటున్నది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? బరువు చక్కగానే ఉంది. తల్లిపాలు మాత్రమే తాగే పిల్లలు రోజూ మోషన్‌కి పోకపోతే కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇలాంటి పిల్లలకు రోజుకు అయిదుసార్లు విరేచనాలు కావొచ్చు. అయిదు రోజులకు ఒకసారి విరేచనం కావొచ్చు. రెండూ సాధారణమే. కాకపోతే బిడ్డ కొద్దిగా అసౌకర్యంగా ఉన్నట్టు, ఇబ్బందిపడుతున్నట్టు చెప్పారు. అది బహుశా కడుపులో గ్యాస్ ఏర్పడడం వల్ల కలిగి ఉండొచ్చు. ఆరు నెలలలోపు శిశువులకు ఈ సమస్య కూడా సాధారణమైనదే. మీకు డాక్టర్లు ఓరల్ డ్రాప్స్ ఇచ్చారని చెప్పారు. అవి గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అడపాదడపా వాడొచ్చు. ఇంకో ముఖ్యమైన విషయం.. తల్లిపాలు ఇచ్చిన తర్వాత భుజం మీద వేసుకుని ఓ పదిహేను, ఇరవై నిమిషాలు నిటారుగా ఉంచుకుంటే.. తేన్పులు వచ్చి రిలీఫ్‌గా ఉంటుంది. కాకపోతే తల్లి భోజనంలో మసాలాలు, కారాలు తగ్గించుకోవాలి. అలాగని పథ్యాలు చేయాల్సిన అవసరం లేదు. ఆరు నెలల్లోపు పిల్లలు పాలు తాగిన తర్వాత వాంతులు చేసుకుంటే పెరుగులా రావడం సహజం.



సాధారణంగా వాంతి అయినప్పుడు అన్నవాహిక నుంచి ఆహారం బయటపడుతుంది. కానీ ఆరు నెలల్లోపు పిల్లలకు వాంతి అయితే జీర్ణాశయానికి చేరిన పాలు తిరిగి బయటికి వస్తాయి. చిన్న వయసు శిశువుల్లో అన్న వాహికకు, జీర్ణాశయానికి మధ్యన ఉండే కండరాలు బలహీనంగా ఉంటాయి. కాబట్టి జీర్ణాశయం చేరిన పాలు తిరిగి అన్నవాహికలోకి వస్తాయి. అందుకే వాంతి అయినప్పుడు బయటపడిన పాలు పెరుగులా ఉంటాయి. ఆ వాంతులకు కంగారుపడకండి. బిడ్డ బరువు సరిగా ఉండి, హుషారుగా ఉంటే దీనికి ప్రత్యేకమైన చికిత్స అవసరమే లేదు. ఒకవేళ బిడ్డకు వాంతులు ఆకుపచ్చ రంగులో అయితే, పొట్ట అకస్మాత్తుగా ఉబ్బితే వెంటనే డాక్టర్‌కి చూపించాలి. సాధారణంగా వచ్చే పాలలాంటి, పెరుగులాంటి వాంతులకు కంగారుపడాల్సిన అవసరం లేదు. మీ బిడ్డకు గ్యాస్ వల్ల పేగుల్లో నొప్పి కలిగి ఉండి ఉంటుంది. ఇప్పటికే పిల్లల వైద్యులు చూశారు. కాబట్టి కంగారు పడకండి.

## ఈ నడక గుండెకు భరోసా



తిండి కలిగితే కండ కలదోయ్ అన్నట్టే, కొవ్వు పెరిగితే.. గుండె జబ్బు కలుగోయ్ అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. గుండె ఆరోగ్యానికీ, శరీరంలో కొవ్వుకీ సంబంధం ఉంది. గుండెలో ఉన్న సమస్యకు, శరీరంలో ఉన్న కొవ్వుకి ఒకటే పరిష్కారం. వ్యాయామం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు. గుండె ఆరోగ్యాన్ని పెంచుకునే వ్యాయామం చేస్తూ.. కొవ్వుని తగ్గించేలా కొన్ని నియమాలు పాటిస్తే డబుల్ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేమిటంటే.. ట్రెడ్ మిల్ మీద కేవలం పరుగే కాక నడకనూ అలవాటు చేసుకోవాలి. రోజువారీగా ట్రెడ్ మిల్ మీద పరుగెత్తే సమయంలో పది నుంచి పన్నెండు శాతం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమయాన్ని నడకకు కేటాయించాలని చెబుతున్నారు. ఆ నడక కూడా ట్రెడ్ మిల్ మీదే. నడకలోనూ వేగం ఉండాలన్నది నిబంధన. గంటకు రెండు నుంచి మూడు మైళ్ల వేగంతో ట్రెడ్ మిల్ స్పీడ్‌ని సెట్ చేసుకోవాలి. ఈ వేగంతో 30నిమిషాల నుంచి 60 నిమిషాల పాటు వాక్ చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే శరీరంలోని కొవ్వు నిల్వలు కరిగిపోవడంతోపాటు రక్తంలోని గ్లూకోజ్ అంతా ఖర్చవుతుందట. కొత్తగా కొవ్వు పేరుకునేకి ఆస్కారమూ ఉండదు. సుదీర్ఘమైన స్పీడ్‌వాక్ గుండె వేగాన్ని మెరుగుపరుస్తుంది. రెండు సమస్యలూ ఉన్నట్లయితే.. మీ వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ సలహా తీసుకున్న తర్వాతే ట్రెడ్ మిల్ మీద ముందడుగు వేయండి.


## పచ్చసొన వద్దనకండి!

గుడ్డులో పచ్చసొన తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని, అది గుండెకు ప్రమాదమని భావించి చాలామంది దాన్ని పకన పెడతారు. మరీ ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు గుడ్డులోని తెల్లసొనను మాత్రమే తిని పచ్చసొనను పారేస్తుంటారు. కానీ పచ్చసొనతో కలిపి తింటేనే గుడ్డు సంపూర్ణ ఆహారం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం తెల్లసొన మాత్రమే తినడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎకువ. తెల్లసొన ఒక ఇన్‌ఫ్లమేటరీ ప్రొటీన్. దీనికి శరీరంలో మంటను కలిగించే స్వభావం ఉంటుంది. దీన్ని పచ్చసొనతో కలిపి తిన్నప్పుడు మాత్రమే అది సమతుల్యమైన, సంపూర్ణ ఆహారంగా మారుతుంది. పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఉంటుందనే కారణంతో దాన్ని అందరూ విలన్‌గా చూస్తారు. కానీ, వాస్తవానికి గుడ్డులోని మెజారిటీ పోషకాలు అందులోనే ఉంటాయి. తెల్లసొనతో పోలిస్తే పచ్చసొనలో విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. మన శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్‌లో దాదాపు 85 శాతం మన కాలేయమే సొంతంగా తయారు చేస్తుంది. కేవలం 15 శాతం మాత్రమే మనం తినే ఆహారం ద్వారా అందుతుంది. శరీరం తనంతట తానుగా తయారు చేసుకునేది ఆరోగ్యానికి ఎప్పుడూ



హానికరం కాదు. కణాల నిర్మాణం, హార్మోన్ల ఉత్పత్తి, మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి మెరుగుపడటానికి కొలెస్ట్రాల్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే పచ్చసొనను విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు బరువు తగ్గాలనుకున్నా, మీ కండరాలు దృఢంగా తయారవ్వాలన్నా గుడ్డును పచ్చసొనతో కలిపి పూర్తిగా తినడమే శ్రేయసరం. మార్కెట్లో దొరికే కృత్రిమ ప్రొటీన్ల కంటే ప్రకృతి సిద్ధంగా ఉత్పత్తి అయ్యే గుడ్డు ద్వారా లభించే పచ్చసొన ఎంతో మేలు చేస్తుంది.

## డిజిటల్ భద్రతే ముఖ్యం!



నేటి డిజిటల్ ప్రపంచంలో.. సోషల్ మీడియా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమై పోయింది. వినోదంతోపాటు కమ్యూనికేషన్, సృజనాత్మకతలోనూ ఇదే కీలకంగా మారింది. అయితే, పెద్దల వరకు సత్ఫలితాలను అందిస్తున్న సామాజిక మాధ్యమం.. పిల్లలకు లేనిపోని చిక్కులు తెచ్చిపెడుతున్నది. ఈ క్రమంలో 'డిజిటల్ భద్రత'పై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. సోషల్ మీడియా వినియోగానికి '13 ఏళ్లు' అనేది చట్టపరమైన కనీస వయస్సు. అయినప్పటికీ, చాలా సందర్భాల్లో వయసు కన్నా.. అవగాహనే ముఖ్యమని పరిశీలకులు చెబుతున్నారు. దాంతోపాటు భావోద్వేగ, సామాజిక సంసిద్ధత కూడా ఉండాలని అంటున్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. మూడు నుంచి 17 ఏళ్ల పిల్లలలో 99శాతం మంది ప్రతిరోజూ ఎంతోకొంత సమయం స్క్రీన్‌పై గడుపుతున్నారట. ఇక ఆన్‌లైన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపున్న యూట్యూబ్‌ను 89శాతం మంది పిల్లలు ఉపయోగిస్తున్నారట. అంతేకాకుండా.. 13 ఏళ్లకన్నా తక్కువ వయసు ఉన్న పిల్లల్లో ఎక్కువ మందికి కనీసం ఒక సోషల్ మీడియా యాప్, సైట్లో సొంత ప్రొఫైల్ ఉన్నదట. ఐదు నుంచి ఏడేళ్ల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులలో.. మూడింట ఒకవంతు మంది తమ బిడ్డకు సోషల్ మీడియా ప్రొఫైల్ ఉన్నట్లు చెప్పారు. అదే ఎనిమిది నుండి 11 ఏళ్ల పిల్లలలో.. 60శాతం మంది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారట. దీన్నిబట్టి.. టీనేజర్లు, ప్రీ టీనేజర్లలో అధికశాతం మంది సోషల్ మీడియాను వాడుతున్నట్లు తేలింది. వీరిలో చాలామంది వినోదం కోసం,

చదువుకు సంబంధించిన విజ్ఞానాన్ని పెంచుకోవడానికే యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో సోషల్‌మీ డియాపై అవగాహన లేమితో లేనిపోని సమస్యల్లో కూరుకుపోతు న్నారు. సైబర్ బెదిరింపులు, గోప్యత, డేటా చోరీలాంటి వాటికి గురవుతున్నారు.

భద్రత, బాధ్యతే ముఖ్యం..: పిల్లలకు ఆన్‌లైన్ భద్రతతోపాటు బాధ్యతగా వ్యవహరించడంపై అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ భద్రత, ఫొటోలు, వీడియోలను పంచుకోవడంతోపాటు హానికరమైన కంటెంట్‌ను గుర్తించడంలో వారికి సహాయపడాలి. దీనివల్ల సైబర్ దాడులు, ఏఐ మార్ఫింగ్ ప్రమాదాలను పిల్లలు అర్థం చేసుకుంటారు. అప్పుడే, సురక్షితమైన ఎంపికలు చేసుకోవడానికి సన్నద్ధమవుతారు. సామాజిక మాధ్యమాల్లోనూ సురక్షితంగా ఉంటారు. అంతేకాకుండా.. సోషల్ మీడియాను సురక్షితంగా ఉపయోగించినప్పుడే.. దాని నుంచి ప్రయోజనాలను పొందగలుగుతారు. లేకుంటే.. పిల్లలు క్రూరమైన, హింసాత్మక, లైంగికపరమైన చిత్రాలను చూసే అవకాశం ఉంటుంది. ఇది వారి ప్రవర్తనపై దుష్ప్రభావం చూపుతుంది. ఇక చాలా సందర్భాల్లో తెలియకుండా తీసిన ఇబ్బందికరమైన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్నీ పంచుకుంటున్నారు. ఫలితంగా, సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు.

ఈ సూచనలు పాటించాల్సిందే!: పాస్‌వర్డ్‌లు, లాగిన్ వివరాలను గోప్యంగా ఉంచాలి. వాటిని స్నేహితులతోనూ పంచుకోవద్దు.

పబ్లిక్ వై-ఫైకి కనెక్ట్ అయినప్పుడు సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ ఖాతాలను ఉపయోగించవద్దు. ఇతర కంప్యూటర్లు, గ్యాడ్జెట్లను ఉపయోగించిన తర్వాత..అన్ని ఖాతాల నుంచీ తప్పకుండా లాగ్ అవుట్ అవ్వాలి. అన్నిటికన్నా ముఖ్యంగా..

పాప్ అప్‌లపై క్లిక్ చేయవద్దు. అవి అశ్లీలత, స్కామ్ సైట్‌లకు దారితీయవచ్చు. తెలిసిన వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను మాత్రమే అంగీకరించాలి. ఆన్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే.. స్క్రీన్‌షాట్ తీసుకొని, వాటి గురించి పెద్దలతో మాట్లాడాలి.

## కావాల్సినంత క్యాల్షియం




క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుందని చాలామంది పిల్లలకి ఉదయాన్నే పాలు తాగిస్తుంటారు. పిల్లలేకాదు పెద్దవారు కూడా క్యాల్షియం కోసం పాలు తాగుతుంటారు. వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో బలం తగ్గుతుంది కాబట్టి వృద్ధులను కూడా పాలు తాగమని చెబుతుంటారు. క్యాల్షియం సప్లిమెంట్స్ కూడా వాడుతుంటారు. పాలతోపాటు ఈ ఆహార పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి. కావాల్సినంత క్యాల్షియం లభిస్తుంది. పాలు తాగకపోతే క్యాల్షియం అందదని చాలామంది అభిప్రాయం. కానీ, అది వాస్తవం కాదు. 100 మి.లీ. ఆవుపాల ద్వారా 120 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. అదే 100 మి.లీ. గేదెపాలు తీసుకుంటే.. 210 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. ఇంతకు రెట్టింపు క్యాల్షియం అందించే పదార్థాలు ఉన్నాయి. అవేంటంటే..

బెస్ట్ సోర్స్: ఉలవల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రా. ఉలవల ద్వారా దాదాపు 290 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. నాన్ వెజ్, పాలు తీసుకోలేని వారికి ఉలవలతో క్యాల్షియం అవసరాలు తీరిపోతాయి.

ఎముకలు ఉక్కులా: రాగులు కూడా క్యాల్షియం రిచ్ సోర్స్. దాదాపు 100 గ్రా. రాగుల ద్వారా 350 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. రాగి జావ, రాగి ఇడ్లీ, దోశ, రొట్టె ఇలా రకరకాల రూపాల్లో రాగులు టేస్ట్ చేయొచ్చు. వీటి వల్ల ఎముకలు ఉకులా మారతాయి.

అంతకుమించి: 100 గ్రా. తోటకూరలో దాదాపు 400 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. ఆకుకూరల్లో క్యాల్షియం సమృద్ధిగా అందించే వాటిలో తోటకూర ముందువరుసలోఉంటుంది.

రుచికి రుచి: 100గ్రా. మునగాకులో 440 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. మునగాకు పప్పు,తాలింపు, పొడి ఇలా రకాలుగా తినొచ్చు.


సూపర్‌ఫుడ్: అవిసె ఆకులు కూడా క్యాల్షియాన్ని అందించే సూపర్ ఫుడ్‌గా చెబుతుంటారు. దాదాపు 100 గ్రా. అవిసె ఆకుల్లో 1200 మి.గ్రా. కాల్షియం ఉంటుంది. ఎలాగైనా తినొచ్చు: 100 గ్రా. నల్లనువ్వుల్లో 1450 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది.

## కిచ్‌కిచ్ తగ్గించుకోండి ఇలా

గొంతులో కిచ్‌కిచ్ ఉంటే ఇబ్బందే. మాటిమాటికీ గొంతు సవరించుకోవడం, కఫాన్ని ఉమ్మివేయడం కష్టమే. కొంతమందైతే కఫాన్ని మింగేస్తారు కూడా. అది చాలా ప్రమాదకరం. గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ప్రవేశించే బ్యాక్టీరియాలతో వ్యాధి నిరోధక శక్తి పోరాడుతున్నట్లు అర్థం. వ్యాధి నిరోధక శక్తి ఓడిపోతున్నప్పుడు మ్యూకస్ (కఫం లేదా శ్లేష్మం) ఏర్పడుతుంది. అది గొంతుకు అడ్డం పడుతుంది. జలుపు, జ్వరం, అలెర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకుదారితీస్తాయి.

దీనివల్ల వచ్చేదగ్గు రెండువారాల కంటే ఎక్కువ ఉంటే ప్రాణాంతకమైన క్షయ వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే మనం గొంతులో కిచ్‌కిచ్ అంతు చూద్దాం. అందుకు మందులతో పనిలేదు. మన వంటింట్లో ఉంటే చిట్కాలేంటో చూద్దాం.

పసుపు, పాలు : గోరు వెచ్చని పాలలో అర టీస్పూన్ పసుపు కలిపి తాగాలి. కాస్త నెయ్యి కూడా వేసుకోవచ్చు. గొంతులో గరగర మాయమై గొంతులో హాయిగా ఉంటుంది. అల్లం, దాల్చిన చెక్క : అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీపొడి కలిపి టీ పెట్టుకొని తాగేయాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది. కాస్త తేనె కూడా కలుపుకోవచ్చు.



అల్లం టీ: అల్లంలో బ్యాక్టీరియాలను చంపే గుణాలున్నాయి. గొంతులో మంటను తగ్గించే లక్షణాలున్నాయి. కాబట్టి అల్లాన్ని మెత్తగా నూరి టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగితే గొంతులో కిచ్‌కిచ్ మాయం.పుదీనా టీ : పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి, ఆ నీటిని తాగేయాలి. అంతే.. మ్యూకస్ పెట్టే బెడద సర్దుకోవాల్సిందే.చామంతి టీ : ఇది పెద్దగా తెలియకపోవచ్చు. నిజానికి ఇది కూడా బాగా పనిచేస్తుంది. కొన్ని చామంతి రేకుల్ని నీటిలో వేసి మరిగించి తాగేయాలి. ఈ టీ బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. దీనిలో తేనె కూడా కలుపుకోవచ్చు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలి

**- మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలి**

**- ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతిబసు**






**నమస్తే భారత్ :**-మరిపెడఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నూతన విద్యా సంవత్సరం మొదలైన సందర్భంగా ఎస్ఎఫ్ఐ మరిపెడ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, మరిపెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కి కేటాయించినటువంటి 5 ఎకరాల స్థలంలో నిరసన చేయడం జరిగింది., ఎస్ఎఫ్ఐ మహబూబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ప్రభుత్వ పాఠశాలలను విస్తృతంగా సందర్శించడం జరుగుతుంది తక్షణమే ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించకుండా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మరిపెడ/బంగ్లా మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి గత ప్రభుత్వ హయాంలో 2021 లో 5 ఎకరాల భూమిని (పెద్ద రాయి గుండు) కేటాయించారు గత ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ని ఏర్పాటు చేయాలని అనేకసార్లు వినతులు ఇచ్చిన అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులకు పదుల మీదున్న శ్రద్ధ విద్యావ్యవస్థ పై ఎందుకు లేదని ప్రశ్నించారు ఇప్పటికైనా మరిపెడ బంగ్లా మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మరిపెడ మండల కార్యదర్శి పెద్దపులి బాసు, మండల సహాయ కార్యదర్శి బాణాల గోపి, నాయకులు రవి, వంశీ, నరేష్, సంతోష్, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో 40 ఏళ్ల సేవకు గుర్తింపు ఎక్కడ..? ఆవుల సర్వేశ్వరరావుకు పదవి ఇవ్వాలని కార్యకర్తల డిమాండ్



**భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే భారత్ బ్యూరో (మూర్తి):**దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న నాయకులకు తగిన గుర్తింపు లభించడం లేదనే విమర్శలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పినపాక నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆవుల సర్వేశ్వరరావుకు ఇప్పటివరకు సరైన పదవి దక్కకపోవడంపై ఆయన అనుచరులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.దాదాపు నలభై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న ఆవుల సర్వేశ్వరరావు పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేశారని కార్యకర్తలు పేర్కొంటున్నారు. పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలు, ఎన్నికల సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేస్తున్నారు. పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసినప్పటికీ, అవసరమైతే జైలుకు కూడా వెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఆయనకు గుర్తింపు రాకపోవడం బాధాకరమని అంటున్నారు.జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పార్టీకి అండగా నిలిచిన నాయకుడిగా ఆవుల సేవలు విశేషమని కార్యకర్తలు చెబుతున్నారు. అయితే పదవుల కేటాయింపులో ఆయన పేరును పరిగణనలోకి తీసుకోకపోవడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న నాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.రానున్న మండల కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో ఆవుల సర్వేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించాలని ఆయన అనుచరులు పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. అర్హత, అనుభవం, పార్టీ పట్ల నిబద్ధత ఉన్న నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తే కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం స్పందించి ఆవుల సర్వేశ్వరరావుకు తగిన గుర్తింపు, బాధ్యతలు కల్పించాలని కాంగ్రెస్ కార్యకర్తలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం స్థానిక కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



**నమస్తే భారత్ :**-తొర్రూరునాణ్యమైన వైద్య సేవలను స్థానికులు అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.పట్టణంలో డాక్టర్ శ్రీనివాస్ ఆర్థోపెడిక్ అండ్ జనరల్ హాస్పిటల్ ను డాక్టర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ గ్రామీణ మరియు పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఈ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నిపుణుల వైద్య సేవలు పొందగలరని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించి,వైద్య సిబ్బందితో మాట్లాడి అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆసుపత్రి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్,సీనియర్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వర్ రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కౌన్సిలర్లు ముద్దసాని సురేష్, వైద్యులు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# మరిపెడ బంగ్లా మున్సిపాలిటీలో అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**- సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్**



**నమస్తే భారత్ :**-మరిపెడ మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి కి సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని, పారిశుద్ధ్య పనులు నిర్లక్ష్యంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అనేక ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా అంగడి ఆవరణ ప్రాంతం డంప్‌యార్డ్‌ను తలపించే విధంగా చెత్త పేరుకుపోయిందని, అక్కడ ప్రభుత్వ ఆసుపత్రి ఉండటంతో రోగులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. అంగడి ఆవరణలో వీధి దీపాలు కూడా సరిగా పనిచేయడం లేదని తెలిపారు.అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని రామ్ విలాస్ రోడ్డు పనులను సత్వరమే పూర్తి చేయాలని, కొత్త తండా వెళ్లే రోడ్డు పనులను వేగవంతం చేయాలని, అలాగే మున్సిపల్ పరిధిలోని తండాల్లో ఇంకా అపరిష్కృతంగా ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చెత్త సేకరణను క్రమబద్ధీకరించడం, పారిశుద్ధ్య పనులను మెరుగుపరచడం, వీధి దీపాలను మరమ్మతు చేయడం, అన్ని అపరిష్కృత అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు.ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# పినపాక డిప్యూటీ తాసిల్దార్ గా డాక్టర్ రమేష్ పదవి బాధ్యతలు స్వీకరణ



**నమస్తే భారత్: భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో (మూర్తి)**పినపాక మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా డాక్టర్ రమేష్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన ఉప తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ, అర్హులైన ప్రజలందరికీ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి పైరవీలకు తావివ్వకుండా చట్టబద్ధంగా, పారదర్శకంగా సేవలందిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్‌కు రెవెన్యూ శాఖ సిబ్బంది, సహోద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేద విద్యార్థులకు వరం

**- చారకొండ వెంకటేష్ తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్**

**- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అయిల్ శ్రీశైలం గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ**





**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్ 17:**తెలంగాణ రాష్ట్రంలోని పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ విద్యా రంగంలో ఒక వరంగా నిలుస్తోంది.ఈ నేపథ్యంలో, రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ద్వారా వెల్జాల గ్రామ విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు మరింత విస్తరించనున్నాయని పేర్కొన్నారు.అలాగే, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు మరియు ముఖ్యంగా చారకొండ వెంకటేష్ సేవలను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాల అభివృద్ధికి ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు.హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడుఅయిల్ శ్రీశైలం గౌడ్.

# నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలి



**నమస్తే భారత్ :**-తొర్రూరునిరుపేద బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మడిపల్లి మాజీ ఎంపిటిసి జక్కా మహబూబ్ రెడ్డి అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాలు మేరకు కంటయపాలెం గ్రామానికి చెందిన గంగాదరి యాకయ్య, జన్నాపురెడ్డి మల్లారెడ్డి లు ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మహబూబ్ రెడ్డి బుధవారం వారి కుటుంబాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ.6 వేలు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహబూబ్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపీసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల సహకారంతో నిరుపేద బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. నిరుపేదలకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మడిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్నం సోమిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చెవిటి సధాకర్, యూత్ జిల్లా నాయకులు రాజేష్ యాదవ్, పట్టణ యూత్ అధ్యక్షులు మహేష్ యాదవ్, నాయకులు పంజాల అల్లూరు, నాల్లం కుమార్,శిరం శెట్టి వీరభద్రం,పల్లె సురేష్ గౌడ్, ఎనగందుల సురేష్, జోగి వెంకన్న, సంద్రీ రాజు,గంగ దారి వెంకటేష్, పస్తం అంజయ్య,యర్రం రాజు యాదవ్, వల్లపు రాఘవులు, మందపూరు శ్రీధర్, రాగి పరిపూర్ణాచారి, రాగి సత్యం, ఈదునూరి మధు,తదితరులు పాల్గొన్నారు.

# దూస్ కల్ లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం..





**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్17:**రంగారెడ్డి జిల్లాలోని ఫరూఖ్ నగర్ మండలంలోని దూస్ కల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంను ఘనంగా నిర్వహించడం జరిగింది.ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో ప్రవేశం పొందిన చిన్నారులకు కొత్త పలకలు, బలపాలు ఇచ్చి సరస్వతీదేవి పూజ చేయించి వారిచేత అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. ఇందులో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామసర్పంచ్ జ్యోతిర్మయి అంజయ్య ప్రేరణతో దాదాపు పది మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుండి ప్రా.పా. దూస కల్ లో ప్రవేశం పొందడం జరిగింది. ఆమె ప్రసంగిస్తూ ప్రభుత్వ బడులు కూడా ప్రైవేటుకు ధీటుగా విద్య అందిస్తున్నాయని, ప్రజలంతా ప్రభుత్వబడుల్లో విద్యార్థుల్ని చేర్చి వాటిని బలోపేతం చేయాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతిర్మయి అంజయ్య, పంచాయతీ కార్యదర్శి ఆశీష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రేవతి, సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, శైలజ, రెడ్యాలాల్, సతీష్, వెంకటేష్, సంతోష్ బాబు, శ్రీనివాస్, సర్ఫరాజ్ అన్వర్ , తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేశారు.



# మరో ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ

మహబూబ్ నగర్ : కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకానికి త్వరలోనే పర్యావరణ అనుమతులు లభించే అవకాశం ఉంది. రూ.4,885 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వికారాబాద్, నారాయణపేట జిల్లాలోని పలు మండలాలకు సాగు నీరు అందించనున్నారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్మించ తలపెట్టిన కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ పథకానికి పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశం ఉంది. దీనికోసం రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు మండలి హైదరాబాద్‌లో సోమవారం సమావేశమైంది. గతంలో జరిగిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలను పరిశీలించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధిలోని కోస్గి, నారాయణపేట, దౌల్తాబాద్,బొంరాస్‌పేట, కొడంగల్, ధన్వాడ, ఊట్కూరు, మక్తల్, మద్దూర్, దామరగిద్ద మండలాల్లోని భూములకు సాగు నీరందుతుంది. భూసేకరణలో భాగంగా ఎకరాకు గరిష్ఠంగా రూ. 20 లక్షల పరిహారం చెల్లించనున్నట్లు ఇంజినీర్లు ఎస్ఇఎసిఐఎఎకు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 4,425 చెట్లను తొలగించాల్సి ఉంది. అలా తొలగించిన చెట్ల స్థానంలో కాలువలు, చెరువుకట్టలపై పదింతల చెట్లను పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ ఎత్తిపోతల పథకం కోసం రూ. 4,885 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ మొత్తంతో నిర్మిస్తున్న ఈ పథకంలో 209 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పంపుహౌస్‌లు, ప్రెజర్ మెయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు అప్పగించింది. పర్యావరణ అనుమతులు మంజూరై, భూసేకరణ పూర్తయితే.. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతాయి.డిసెంబర్ 8న కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖలు ఈ ప్రాజెక్టు పరిధిలోని రెండు ప్రాంతాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించాయి.ఆ నివేదికల ఆధారంగానే ఎస్ఇఎసిఐఎఎ సమావేశం జరిగింది. ఇంజినీర్ల అంచనా ప్రకారం, కొద్దిరోజుల్లోనే పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశాలున్నాయి. ఆ వెంటనే భూసేకరణ జరిపి.. పనులు వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# బొంద రాజకీయాలు..!

హైదరాబాద్,: తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం "బొంద పెట్టాలి" అనే పదం చుట్టూ పెద్ద దుమారమే రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి బీఆర్ఎస్ ఇస్తున్న కౌంటర్లు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్ అయ్యాయి. ఖమ్మం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఒకప్పుడు తాను పెరిగిన తెలుగుదేశం పార్టీని తెలంగాణలో నామరూపాలు లేకుండా చేసిన కేసీఆర్‌పై రేవంత్ తన కసిని వెళ్లగక్కారు. అయితే, దీనికి బీఆర్ఎస్ ఇస్తున్న రిటార్ట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచే మొదలైంది. తెలంగాణలో నేడు టీడీపీకి బలమైన నాయకత్వం లేకపోయినా, క్షేత్రస్థాయిలో ఆ పార్టీ సానుభూతిపరులు, కేడర్ ఇంకా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉండటంతో,ఆ ఓటు బ్యాంకులో మెజారిటీ కాంగ్రెస్‌కు మళ్లినట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చంద్రబాబుకు వ్యతిరేకంగా కేసీఆర్, జగన్ చేతులు కలిపారనే భావన టీడీపీ అభిమానుల్లో బలంగా ఉంది. దీనిని క్యాష్ చేసుకునేందుకే రేవంత్ రెడ్డి "టీడీపీని దెబ్బతీసిన కేసీఆర్‌ను,ఆయనబీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలి'' అంటూ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు.రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేతలు తీవ్రంగా స్పందిస్తూ ఒక చారిత్రక కోణాన్ని ముందుకు తెచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే కాంగ్రెస్ వ్యతిరేక భావజాల ంపైన..! ఎన్టీఆర్ తన జీవితాంతం కాంగ్రెస్ అరాచక పాలనపైనే పోరాడారు

# బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం..




రాయచోటి,: బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు,మదనపల్లె జిల్లాలోని బర్డ్ ఫ్లూ సోకిన పలు కోళ్ల ఫారాలను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కోళ్ల ఫారం యజమానులతో జిల్లా కలెక్టర్ వారి కష్టాలను బర్డ్ ఫ్లూ పై తీసుకుంటున్న చర్యలను ఈ బర్డ్ ఫ్లూ భవిష్యత్తులో రాకుండా పూర్తిస్థాయిలో నివారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలోవిపులంగా చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామనీ హామీ ఇచ్చారు.అంతేకాకుండా మదనపల్లెలోబర్డ్ ఫ్లూ పై కంట్రోల్ రూమ్ ఏర్పాటు. చేశామని చెప్పారు.కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు దాదాపు శూన్య మనీ వివరించారు100 డిగ్రీలకు పైగా వేడి చేసిన మాంసంలో బర్డ్ ఫ్లూ వైరస్ ఉండదనితెలిపారు.అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలోని రెండు కోళ్ల ఫారాలలో గుర్తించిన బర్డ్‌ఫ్లూ పై ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని,బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాలలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్లను ఖననం చేయడానికి జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.సదుం మండలంలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై చర్యలు తీసుకునేందుకు పశుసంవర్ధక శాఖకు తగిన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల సమన్వయంతో.సదుం మండలం నుండి ఇతర ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సదుం మండలం మినహా మిగతా ఏ మండలాలలో అసాధారణ కోళ్ళ మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ఈవిషయంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ.అన్నమయ్య జిల్లాసదుం మండలంపుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె, కంభం వారి పల్లె, గ్రామాలకు చెందిన ముగ్గురు రైతుల కోళ్ల ఫారాలలో అనూహ్యమైన సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవించగా అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ మొదటి రెండు కోళ్ల ఫారాల నుండి చనిపోయిన కోళ్లశాంపుల్స్ ను మధ్యప్రదేశ్ భోపాల్ లోని హై సెక్యూరిటీ ల్యాబ్‌కు పంపగా చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లుగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో... పుత్తవారిపల్లె మరియు అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాల లోని కోళ్లనుస్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా బ్లీచింగ్ పౌడర్ సున్నంలను ఉపయోగించి కోళ్లను ఖననం చేసినట్లుగా పేర్కొన్నారు. కంభంవారి పల్లె గ్రామంలోని కోళ్ల ఫారానికి చెందిన కోళ్ల శాంపిల్స్ యొక్క నివేదిక భోపాల్ నుండి రావాల్సి ఉందని నివేదిక వచ్చిన వెంటనే దానిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆటోల ద్వారా టామ్ టామ్ వేయిస్తున్నామని పేర్కొన్నారు. కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు చాలా చాలా తక్కువ అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూరు డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో వేడి చేసిన చికెన్ ను తినడం వల్ల ఎటువంటి సమస్య ఉండదని ప్రజలు ఈ విషయంలో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అమ్మగారిపల్లె పుత్తవారిపల్లె గ్రామాలలో కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేశామని, ప్రజలు ఎవరైనా కోళ్లలో అసాధారణ మరణాలు సంభవించడం గమనిస్తే వెంటనే 7013914401, (అమ్మవారి పల్లి), 9398262752, (పుత్తవారిపల్లె) నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలపవచ్చని పేర్కొన్నారు.

## హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు

# భూసేకరణ అడుగులు



హైదరాబాద్ : హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఈ భాగానికి త్వరలో టెండర్లు పడనుండగా.. 1,895 హెక్టార్ల భూసేకరణ జరగాల్సి ఉంది. వీటితో పాటు.. ఆర్మూర్-మంచిర్యాల, మహబూబ్‌నగర్ మార్గాల్లో 1,372 హెక్టార్లకు గానూ కేవలం 255 హెక్టార్లే పూర్తయ్యాయి. భూసేకరణ ప్రక్రియ వేగవంతమైతేనే ఎన్‌హెచ్ఏఐ పనులు పట్టాలెక్కనున్నాయి.తెలంగాణ గేమ్ ఛేంజర్‌గా హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల కల్పనలో అత్యంత కీలకమైన ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భావిస్తోంది. ఆర్ఆర్ఆర్‌తో పాటు పలు జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారింది.హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులు ప్రారంభించేందుకు ఎన్‌హెచ్ఏఐ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1,895 హెక్టార్ల భూమి అవసరం. కాగా ఇప్పటికే 1,862 హెక్టార్లకు సంబంధించి 3డీ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో.. మరోసారి టెండర్లను ఆహ్వానించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నగరం చుట్టూ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.రాష్ట్రంలో కేవలం రీజినల్ రింగు రోడ్డే కాకుండా, మరిన్ని కీలక జాతీయ రహదారుల పనులు కూడా భూసేకరణ గండం దాటాల్సి ఉంది. ఆర్మూర్ నుండి మంచిర్యాల వరకు, మహబూబ్‌నగర్ పరిధిలో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. జగిత్యాల- మంచిర్యాల, మహబూబ్‌నగర్- గూడెబల్లూర్, ఆర్మూర్- జగిత్యాల, జగిత్యాల- కరీంనగర్ ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నాలుగు రహదారుల కోసం మొత్తం 1,372 హెక్టార్ల భూమి అవసరం. ఇప్పటి వరకు కేవలం 255 హెక్టార్లు మాత్రమే సేకరించారు. మిగిలిన భూసేకరణ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉండటం ప్రాజెక్టుల నిర్మాణం ఆటంకంగా మారింది.జగిత్యాల-కరీంనగర్ రహదారి విస్తరణకు సంబంధించి రైల్వే శాఖ నుంచి రావాల్సిన అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరోవైపు, ఈ రహదారుల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయింది. పనుల పర్యవేక్షణ కోసం త్వరలోనే కన్సల్టెన్సీ సంస్థలను ఎంపిక చేయాలని ఎన్‌హెచ్ఏఐ డిసైడ్ అయింది. భూసేకరణ కొలిక్కి వస్తేనే కన్సల్టెన్సీల నియామకం, క్షేత్రస్థాయి పనులకు అడ్డంకులు తొలిగిపోతాయని అధికారులు చెబుతున్నారు.ఈ ప్రాజెక్టుల కోసం భారీ నిధులను కేటాయించినప్పటికీ..

రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను ఎంత వేగంగా పూర్తి చేస్తుందనే దానిపైనే వీటి భవితవ్యం ఆధారపడి ఉందని నిపుణులు చెబుతున్నారు. భూసేకరణ పూర్తయి, క్లియరెన్స్ లభిస్తేనే కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఆర్ఆర్ఆర్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే తెలంగాణ ఆర్థిక ముఖచిత్రం మారడమే కాకుండా.. జిల్లాల మధ్య కనెక్టివిటీ కూడా పెరుగుతుందని అంటున్నారు.

# యాప్‌లపై టెక్ నిపుణులేమంటున్నారంటే..?!



దేశ భద్రత పేరుతో పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు కేంద్ర ప్రభుత్వం భంగం కలిగిస్తోందా?! ఎందుకంటే పార్లమెంటు సమావేశాల సందర్భంగా మోడీ సర్కార్ సంచార్ సాథీ యాప్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించింది. అయితే ప్రతిపక్షాల నిరసనలతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్టు ప్రకటించింది. ఇదే కాదు.. నవంబర్ 24 కేంద్రం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం 2023లో నోటిఫై చేసిన నిబంధనలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నాయని జర్నలిస్టు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో కేంద్రం అమలు చేయాలనుకున్న ఈ విధానాలు పూర్తిగా సమాచారానికి సంబంధించినవే కావడం గమనార్హం. కేంద్రం తేవాలని ప్రయత్నించిన సంచార్ సాథీ యాప్ ద్వారా పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతుందనేది బహిరంగ సత్యం. అయితే దీనిపై కేంద్రం చెబుతున్న మాటలు మరోలా ఉన్నాయి. పొరపాటున పోగట్టుకున్న లేదా దొంగిలించిన స్మార్ట్‌ఫోన్‌లను బ్లాక్ చేయడానికి, వాటిని ట్రాక్ చేయడానికి ఈ సంచార్ సాథీ యాప్ ఉపయోగపడుతుందని.. అందుకే ఈ యాప్‌ని తేవడానికి ప్రయత్నించినట్లు కేంద్రం చెప్పింది. అయితే అసలు ఈ యాప్‌పై టెక్ నిపుణులు ఏమంటున్నారంటే.. ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయాయి. ఇవి వ్యక్తిగత విషయాలను చాలా గోప్యంగా ఉంచుతాయి. అందుకే..స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు చెప్పుకోలేని సమాచారాన్ని కూడా ఇవి భద్రంగా ఉంచుతాయి. అసలు చాలామంది వినియోగదారులకు తమ ఫోన్లలో ఇలాంటి యాప్ ఒకటి ఉందని వారికి తెలియకపోవచ్చు. కొద్దిమంది మాత్రమే ఫోన్లలో ఈ యాప్ గురించి శోధించి.. తొలగించడానికి ప్రయత్నిస్తారు. ఈ యాప్ వల్ల జరిగే ప్రయోజనం కంటే.. వినియోగదారులకు నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఈ యాప్ ద్వారా వ్యక్తిగత డేటాను సులభంగా పొందవచ్చు. కాల్ లాగ్‌లు, పరిచయాలు, మీరు ఎక్కడున్నది? మీ చరిత్ర, మీరు మాత్రమే గోప్యంగా ఉంచుకునే సమాచారాన్ని కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీరు పంపే సందేశాల్ని ఈ యాప్ ద్వారా సేకరించ వచ్చు. అలాగే ఈ యాప్ వినియోగదారుల హక్కుల్ని కూడా దెబ్బతీ స్తుంది. ఇది ఫోన్ పనితీరుపై కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే స్మార్ట్‌ఫోన్లను రక్షించడానికని చేసే ప్రయత్నం.. మెరుగైన పద్ధతుల్లో ఉండాలి. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వ్యవస్థను బలోపేతం చేయవచ్చు. తప్పనిసరి అని భావిస్తే.. యాప్‌కు కోడ్ తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు.


# సిద్ధా భగీరథ ప్రయత్నం?



ఒంగోలు, : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు ఒక మాజీ మంత్రి. అయితే ఏడాది కిందట ఆయన రాజీనామా చేశారు. కానీ ఇంతవరకు ఏ పార్టీలో చేరలేదు. ఇష్టమైన పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. మరో పార్టీలో చేరే ఉద్దేశం లేదు. దీంతో గత కాలంగా ఆయన భగీరథ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చంద్రబాబును కలిశారు. కానీ లోకల్ నాయకత్వం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇప్పుడు స్థానిక నేతలను సముదాయించారు చంద్రబాబు. దీంతో ఆ నేతకు పార్టీలో చేర్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆ మాజీమంత్రి తెలుగుదేశం పార్టీలో చేరుతారని సొంత జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అలానే ఆపార్టీకి రాజీనామా చేశారు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన తరువాత రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. అలా చేరిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకత్వం ఆయనకు ఒక హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే దర్శి టికెట్. గతంలో అదే నియోజకవర్గంలో నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచా రు. అందుకే ఆ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు అయితే అయిష్టంగానే ఆ పార్టీలో కొనసాగారు రాఘవరావు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే రాజీనామా ప్రకటించారు. చంద్రబాబుతో ఉన్న తన పాత సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ పార్టీలోకి వస్తానని కోరారు. అయితే స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు ఉండడంతో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో సీనియర్ మోస్ట్ లీడర్ సిద్దా రాఘవరావు. 1999 నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2007లో చంద్రబాబు ఎమ్మె ల్సీగా అవకాశం కల్పించారు. 2014లో దర్శి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచేసరికి తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు రాఘవరావును. ఐదేళ్లపాటు మంత్రి పదవిలో కొనసాగిన ఆయనను 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు.

ఆఎన్నికల్లో ఓటమి ఎదురయ్యేసరికి రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్‌ఒత్తిడికి వెనక్కి తగ్గారు. దర్శి టిక్కెట్ హామీతో ఆ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఓడిపోయేసరికి రాఘవరావుకు స్వేచ్ఛ లభించింది. అందుకే ఇప్పుడు మాత్ర పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలుగుదేశం పార్టీలోకి రావడం ఖాయమని తెలుస్తోంది. కానీ దర్శికి ఇప్పటికే టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు గొట్టిపాటి లక్ష్మి. మొన్నటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు రాఘవరావు వస్తుండడంతో లక్ష్మి పరిస్థితి ఏంటి అనేది తెలియడం లేదు.చంద్రబాబు ఇద్దరికీ న్యాయం చేస్తారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## మానవ వ్యర్థాలతో క్యాన్సర్ ఔషధం!



న్యూఢిల్లీ : క్యాన్సర్‌కు మానవ వ్యర్థాలతో ఔషధాన్ని కెనడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీటిని 'ఫెకాల్ కాప్సూల్స్' అని, శాక్ష్మయ భాషలో ఫెకాల్‌మైక్రోబయోటా లేదా ఎఫ్ఎంటి అని పిలుస్తారు. ఆరోగ్యవం తుడైన మనిషి వ్యర్థాలను ఫ్రీజ్ చేసి, ఎండపెట్టి వాటిని ఎఫ్ఎంటి క్యాప్సూల్స్‌గా తయారు చేస్తారు. ఈగోలీలు పొట్టలోకి చేరి మంచి సూక్ష్మజీవులను పెంపొందిస్తాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో సాధారణంగా వాడే ఔషధాలతో పోలిస్తే ఈ ఎఫ్ఎంటి గోలీలు 40-45 శాతం ఎక్కువ ప్రయోజనకరంగా పనిచేస్తాయి. వీటిని సాధారణ క్యాన్సర్ ఔషధాలతో కలిపి తీసుకొంటే 80 శాతం ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. చర్మ క్యాన్సర్ విషయానికి వస్తే ఎఫ్ఎంటి పిల్స్‌ను సాధారణ ఔషధాలతో కలిపి తీసుకొంటే 79 శాతం అధిక ప్రయోజనం చేకూరుతుంది.

## అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్దశ

అనంతపురం, : ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి.రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది.అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిర్కోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు.

# ప్రాణాల మీదకు డిజిటల్ వ్యసనం!

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ముగ్గురు టీనేజ్ సిస్టర్స్ ప్రాణాలు తీసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇది టీనేజర్ల ఇంటర్నెట్ వాడకంపై, ముఖ్యంగా నియంత్రణ లేని ప్రపంచంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. చిన్న పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు వయో పరిమితులు విధించే విషయంలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వయసు ఆధారంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగానికి అనుమతి ఇచ్చే విషయంలో ఇటీవల ఆర్థిక సర్వే పలు సూచనలు చేసిందని, ఆ సర్వే అభిప్రాయాలన్నింటిని ప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ చెప్పారు. వయసు పరిమితి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఇంటర్నెట్ కార్పొరేషన్ ఫర్ అసైన్డ్ నేమ్స్ అండ్ నంబర్స్ (ఐసీఏఎన్ఎన్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పిల్లలు ఇంటర్నెట్‌ను వినియోగించే విషయంలో ఆస్ట్రేలియా తరహా చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు వయసు నిబంధనలతో పాటు డిజిటల్ వ్యసనాన్ని తగ్గించడానికి ఆన్‌లైన్ టీచింగ్‌ను కూడా తగ్గించాలని ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సూచించింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా వయసు ధ్రువీకరణను చేయాలని, డిజిటల్ వ్యసనానికి దూరంగా ఉంచేందుకు వీలుగా పిల్లలకు విద్యా విషయాలను అందించే సులువైన పరికరాలను ప్రోత్సహించాలని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. హానికరమైన కంటెంట్‌కు పిల్లలు ప్రభావితమవుతారని, వయసు ధ్రువీకరణ బాధ్యతను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లే వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ సర్వే విడుదల సందర్భంగా చీఫ్ ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ, ఇంటర్నెట్ వినియోగానికి వయసు నిబంధనలు తెచ్చే ఆలోచనలో ఆంధ్రప్రదేశ్, గోవా ప్రభుత్వాలు ఉన్నట్లు తమకు తెలిసిందన్నారు. ఇటీవల ఘజియాబాద్‌లో ముగ్గురు బాలికలు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం, కొరియా కల్చర్ మోజుపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఆన్‌లైన్ కంటెంట్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.వయసులో పెద్ద, జాబ్ స్ట్రెస్ వల్ల ఇలా చేసుకున్నారా అంటే కాదు. నిషికా (16), ప్రాచి (14), పాఖీ (12). కనీసం యుక్తవయసుకు కూడా రాకముం దే.. బుధవారం తెల్లవారు జామున వారి ఉంటున్న తొమ్మిదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే..ఈ అమ్మాయిలు ఆన్‌లైన్ గేమ్స్‌కు, కొరియన్ పాప్ కల్చర్‌కు ప్రభావి తమయ్యారని.. దాంతోవారి తండ్రిమొబైల్ ఫోన్లనుఎక్కువగా వాడటం పై అభ్యంతరం వ్యక్తం చేశారని మీడియా నివేదికలు చెప్తున్నాయి.

పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగా.. మైనర్ల స్క్రీన్ సమయం, డిజిటల్ యుగంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ పాత్రపై విస్తృత చర్చ మళ్లీ మొదలైంది.మానసిక ఆరోగ్య నిపుణులు ప్రకారం.. కౌమారదశ అనేది చాలా సున్నితమైన దశ. కాబట్టి వారి డిజిటల్ అలవాట్లను తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించడం చాలా అవసరమని నొక్కి చెబుతున్నారు. ఆర్టిమిస్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో సీనియర్ కన్సల్టెం ట్, సైకియాట్రీ హెడ్ డాక్టర్ రాహుల్ చందోక్ ఏమి చెప్పారంటే.. కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఘజియాబాద్ సోదరీమణులు పాఠశాలకు వెళ్లలేదనే నివేదికలను ప్రస్తావించారు.

"పిల్లలకు సాధారణ కార్యకలాపాలు లేనప్పుడు.. ఆన్‌లైన్, మొబైల్ గేమ్‌ల ఉచ్చులో పడటం చాలా సులభం అవుతుంది" అని డాక్టర్ చందోక్ ంఃఖతో తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు తరచుగా భావోద్వేగాలకు ఒక మార్గంగా మారుతాయని అన్నారు. గురుగ్రామ్‌లోని సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్‌లో చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకియాట్రిస్ట్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రమిత్ రస్తోగి మాట్లాడుతూ.. మితంగా ఫోన్ వాడటం వల్ల పిల్లలు తమ స్నేహితులతో రిలేషన్స్ కొనసాగించగలుగుతారని అన్నారు. 6 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవ డంపై దృష్టి పెడతారు. అయితే 13, 18 సంవత్సరాల మధ్య గుర్తింపు ఏర్పడే దశ.. ఇది పరస్పర భావోద్వేగాలను కోరుకుంటుందని వివరించారు.' 'గుర్తింపు సరిగ్గా రాకపోయినా, చేసిన పనికి తగిన అప్రిసియేషన్ లేకపోయినా.. అది టీనేజర్లను బలహీనపరుస్తుంది" అని రస్తోగి అన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం గురించి మాట్లాడు తూ.. "ఆటోమేటిక్"గా అనిపించే అనుభవాలు.. తక్కువ ఎఫర్ట్స్‌తో తక్షణమే వచ్చే గుర్తింపుసంతృప్తిని అందిస్తాయని పేర్కొన్నారు.ము గ్గురు సోదరీమణులు సామాజికంగా దూరంగా ఉన్నారని వచ్చిన నివేదికలను ప్రస్తావిస్తూ.. ఒంటరితనం తరచుగా టీనేజర్లను జీవితా నికి దూరం చేస్తుందని అన్నారు. "ఒక టీనేజర్ సమాజానికి ఎంత దూరంగా ఉంటే.. జీవితానికి రంగులు తెచ్చే విషయాలకు అంతగా దూరమవుతారు, స్క్రీన్‌కి దగ్గర అవుతారని" అని ఆయన అన్నారు. ఒంటరిగా, స్నేహితులకు దూరంగా లేదా తల్లిదండ్రుల శ్రద్ధకు దూరంగా ఉన్న పిల్లలు దీనికి ఎక్కువ గురవుతారని చందోక్ అభిప్రా యపడ్డారు. అలా పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్, ఇతర వ్యాపకాలపై ఎక్కువ దృష్టి సారిస్తారని అన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు నిపుణులు. వారి సేఫ్టీగా కోసం మొబైల్ ఇవ్వాలనుకుంటే అది కరెక్ట్ కాదని.. మొబైల్ అవసరం లేని పరిస్థితిని ఇంటా, బయట క్రియేట్ చేయాలని చెప్తున్నారు. పాఠశాలకు వెళ్తూ, బయట ఫ్రెండ్?షిప్ చేస్తూ, పరీక్షలు రాసే, సాధారణ కార్యకలాపాల్లో పాల్గొనే పిల్లలు నార్మల్?గా ఉంటారని గుర్తించాలని రస్తోగి తల్లిదండ్రులకు సూచించారు. అలాగే తల్లిదండ్రుల పెంపకం కూడా పరిస్థితులకు అనుగుణంగా మారవలసి ఉంటుందని.. తెలిపారు. అన్ని విషయాల్లో కఠినంగా ఉండనవసరం లేదని.. కొన్ని విషయాల్లో వారికి ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని.. అలా అని పూర్తిగా వదిలేయకూడదని చెప్తున్నారు.

# భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ఔన్నత్యం!




అన్ని మతాలను, సంస్కృతులను గౌరవించటం మన వారసత్వం. కానీ, ఇటీవల కొంతమంది మతోన్మాదంతో ఈ సంస్కతికి భంగం కలిగిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మతం పేరిట ఉన్మాదాన్ని రెచ్చగొట్టటం, వివాదాలు సృష్టించటం తరచూ చూస్తున్నాం. ఉత్తరాఖండ్‌లో ఒక మతోన్మాద మూక ఇలాంటి వివాదాన్నే రగిలించబోతే– ధైర్యంగా ఎదుర్కొన్నాడు దీపక్ కుమార్. 'మనుషుల మధ్య పెరగాల్సింది ప్రేమ. విద్వేషం కానేకాదు." అని గట్టిగా చెప్పి, మానవత్వానికి, మనిషితనానికీ ప్రతీకగా నిలిచాడు. మతాల పేరుతో మనుషుల మధ్య చిచ్చుపెట్టాలని ఉన్మాదులు ప్రయత్నించిన ప్రతిసారీ ఇక్కడ 'మతం కంటే మానవత్వం గొప్పది' అని నిరూపితమవుతూనే ఉంది. తాజాగా ఉత్తరాఖం డ్‌లో జరిగిన ఉదంతం మరోసారి దాన్ని రుజువు చేస్తోంది. అయితే ఈ సారి మరింత ప్రభావ వంతంగా కనిపిస్తోంది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధ ముస్లింకి అండగా నిలబడిన హిందూ యువకుడిని, దాడి చేస్తున్న మూక 'నువ్వెవరు?' అని ప్రశ్నించింది. అప్పుడు ఆ యువకుడు.. 'నేను.. మహ్మద్ దీపక్‌ని. నేను హిందువుని. అంతకంటే ముందు నేను భారతీయుడిని' అని తీక్షణమైన చూపులతో సమాధానం చెప్పాడు. ఆ మాటలు మాట్లాడుతున్న దీపక్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'రాజ్యాంగ బద్ధంగా ఈ దేశాన్ని పాలించుకుంటాం' అని ప్రమాణం చేసుకుని 75 ఏళ్ల గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న రోజున, ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ ఘటన జరిగింది. ఉత్తరాఖండ్ కొత్ద్వార్ పటేల్ వీధిలో 70 ఏళ్ల ముస్లిం వ్యక్తి 'బాబా స్కూల్ డ్రెస్ అండ్ మ్యాచింగ్ సెంటర్' పేరుతో ఓ దుకాణం నడుపుతున్నారు. మూడు దశాబ్దాలుగా ఆ పేరుతోనే నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆయన పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన కుమారుడు షోయబ్ షాపు బాధ్యతలు తీసుకున్నారు. మొన్న జనవరి 26న కొంతమంది భజరంగ్ దళ్ వ్యక్తులు వచ్చి షాపులో ఉన్న షోయబ్‌ని, ఆయన తండ్రిని తీవ్ర దుర్భాషలాడారు. 'బాబా' పేరు హిందువుల పేరని, ఆ పేరుతో షాపు నిర్వహించకూడదని హుకుం జారీచేశారు. హిందూ పేరు పెట్టుకుని ఓ ముస్లిం షాపు నడపడం ఏంటని కళ్లెర్రజేశారు. ఈ హఠాత్ పరిణామా నికి ఆ వృద్ధుడు నిలువెల్లా కంపించిపోయాడు. షోయబ్ ఆ వ్యక్తులకి సర్దిచెప్పేందుకు నానా తిప్పలు పడుతున్నాడు. ఇది కొత్తగా పెట్టుకున్నది కాదని, 30ఏళ్ల నుండి దీన్ని ఇలాగే నడుపు కుంటున్నామని బతిమాలాడాడు. అయినా ఆ మూక వినిపించుకోలే దు. గట్టి గట్టిగా అరుస్తూ వాళ్లని భయభ్రాంతులకు గురిచేశారు. అప్పుడు అక్కడే, పక్క షాపులో ఉన్న దీపక్ ఈ మొత్తం వ్యవహారాన్ని చూశాడు. వెంటనే ఆ మూకని ఎదుర్కొనేందుకు, ఆ ముస్లిం సోదరు లకి సాయంగా ఉ ండేందుకు ముందుకు వచ్చాడు. దీపక్ మామూ లుగా రాలేదు. 'ఏంటి భారు ఈ గలాటా! 'బాబా' పేరు పెట్టుకుంటే మీకేంటి? ముందు ఇక్కడి నుండి వెళ్లిపోండి?' అని తీవ్రస్వరంతో చెప్పాడు. వెంటనే మూకలోని ఓ వ్యక్తి 'నువ్వెవరు? అసలు వీళ్లకి నువ్వు ఏమవుతావు?' అని ప్రశ్నించాడు. 'నేను మహ్మద్ దీపక్!. నేను హిందువుని. నా మతం అంటే నాకు ఎనలేని గౌరవం. అయితే అంతకంటే ముందు నేను భారతీయుడిని' అని దీపక్ సమాధానం చెప్పాడు. ఇదంతా జరుగుతున్నప్పుడే మరికొంతమంది హిందూ యువకులు వచ్చి దీపక్‌కి సాయంగా నిలబడ్డారు. మూకని వెళ్లగొట్టారు. గొడవ ఇంతటితో ఆగిపోలేదు. మూకతో దీపక్ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మత సామరస్యానికి చిహ్నంగా నిలిచిన అతని ధైర్యసాహసాలకి దేశ నలుమూలల నుండి ప్రశంసలు వెల్లువెత్తాయి. అది సహించలేని కుహనా దేశభక్తులు ఈసారి దీపక్‌పై తమ ద్వేషాన్ని వెళ్లగక్కారు. జనవరి 31న జిమ్ నిర్వాహకుడైన దీపక్‌కి వ్యతిరేక నినాదాలు చేస్తూ వందల సంఖ్యలో భజరంగ్ దళ్ సభ్యులు కొత్ద్వార్ చేరుకున్నారు. దీపక్ 'జిమ్'ని దిగ్బంధం చేశారు. 'ముస్లిం వ్యతిరేక నినాదాలు చేస్తూ.. నువ్వు కూడా వాళ్లల్లో చేరిపో' అని దుర్భాషలాడారు. అయినా వాళ్ల అక్కసు చావలేదు. వృద్ధుడైన 60 ఏళ్ల తమ కార్యకర్తపై దీపక్ దాడి చేశాడని నిందలు వేసి, పోలీసు స్టేషనులో కేసు పెట్టారు. ఇక్కడ విచారించాల్సిన విషయం మరొకటి జరిగింది. ఆ రోజు జరిగిన దాడిలో ఇరుపల నుండి వచ్చిన ఫిర్యాదులని తీసుకున్న పోలీసులుమూక సభ్యులని వదిలిపెట్టి, దీపక్‌ని పోలీస్ స్టేషనుకి తీసుకెళ్లారు. పగలంతా అక్కడే వుంచి రాత్రికి ఇంటికి పంపారు. దీపక్‌పై వాళ్లు పెట్టిన కేసు ఇంకా ఉంది. దీపక్‌ని, కుటుంబసభ్యులని బెదిరిస్తూ అప్పటి నుండి ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. జిమ్ కూడా మూతబడింది. ఇదంతా దీపక్‌కి వచ్చిన అనుకోని కష్టం. దీనిపై దీపక్ మాట్లాడుతూ, 'వాళ్లు ఎన్ని బెదిరించినా నేను భయపడను. ఆ రోజు నేను ఏదైతే చెప్పానో (మహ్మద్ దీపక్) దానికే కట్టుబడి ఉంటాను. ఈదేశంలో అన్నిమతాలు సమానం. ఇక్కడ ఎవరూ హిందువు లు, ముస్లింలు, సిక్కులు, జైనులు కాదు. అందరూ భారతీయులు. మతం కంటే ఇక్కడ మానవత్వం కనిపిస్తుంది. అందుకే ఆ రోజు నేను వాళ్లకి అండగా నిలబడ్డాను. నాలాగే ఈ దేశంలో ఎంతోమంది ఉన్నారు. వారే అసలైన భారతీయులు. నా సహోదరులు' అని దీపక్ ఎంతో గంభీరంగా చెప్పాడు. 'భారతీయత' అన్న పదానికి అసలైన అర్థం ఇదే కదా!: ఈ ఘటన తరువాత వస్త్ర దుకాణాల కమిటీ వ్యక్తులు కూడా దీనిపై స్పందించారు. 'మతం పేరుతో మా మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే మేం ఊరుకోం. ఎప్పటి నుండో మేమంతా కలిసిమెలిసి ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నాం. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదు. ఇప్పుడు మీరు వచ్చి గలాటా చేస్తుంటే చూస్తూ కూర్చోం' అంటూ ఖరాఖండిగా మధ్య వయస్కుడైన ఓ హిందూ వ్యక్తి మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడో ఓ చోట ఈ తరహా ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. విద్వేషం రెచ్చగొట్టాలని చూసిన ప్రతిసారీ హిందూ, ముస్లిం ఐక్యతని చాటే వ్యక్తులు కనప డుతూనే ఉన్నారు. మొన్నీమధ్య తమకి వ్యతిరేకంగా వార్తలు రా స్తున్నాడని, అధికారుల సాయంతో కాశ్మీరీ ముస్లిం జర్నలిస్టు ఇంటిని కూల్చేస్తే, వాళ్లకి తన ఇంటి పత్రాలు ఇచ్చి దాతృత్వం చాటుకున్న వ్యక్తి ఓహిందువు. 'ముస్లిం దర్జీల దగ్గరికి హిందూ మహిళలు వెళ్లొ ద్దని, కొలతల పేరుతో వారు అసభ్యంగా ప్రవర్తిస్తార'ని 24 ఏళ్ల కిందట ఆంక్షలు పెట్టినప్పుడు ప్రముఖ పర్యావరణ వేత్త, పద్మ భూషణ్ గ్రహీత డాక్టర్ అనిల్ పి.జోషి భార్య సంధ్య జోషి, ఆమె సోదరి గీతా ఆ ఆరోపణలని తీవ్రంగా ఖండించారు. దర్జీ దగ్గరకి వెళ్లకుండా వారిని అడ్డుకున్న విహెచ్‌పి, భజరంగ్‌దళ్ సభ్యులతో వాగ్వాదానికికూడా దిగారు. దశాబ్దాల నుండి భారతదేశంలో ఇదే జరుగుతోంది. ఈ సామరస్య వాతావరణాన్నిచెడగొట్టేందుకు, పాల కుల అండతో మూకలు ఇప్పుడు మరింత దూకుడుగా వ్యవహరిస్తు న్నాయి.

## పేదవాడి మెతుకు కార్డుపై అధికారుల నిర్లక్ష్యం

ఇటిక్యాల : కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వందలాదిమంది నిరుపేదల ఆశలు అడియాశలవుతున్నాయి. గత పది ఏళ్ల తరబడి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు దేవుడు కరుణించిన కానీ అధికారులు కనికరించరన్న అపవాదిని రెవెన్యూ అధికారులు మూటగట్టుకుంటున్నారు. రేషన్ కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు నెలలు తరబడి రేషన్ కార్డుల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి కార్యాలయాల్లో ఫైళ్లు కదలాలంటే ꠸చేతులు తడవాల్సిందే꠸ అన్న విమర్శలు కార్యాలయ వెలుపల్లో వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు దారుణంగా ఉంది. అర్హులైన నిరుపేదలు మీ–సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా, అవి నేటికీ ఎమ్మార్వో లాగిన్‌లలోనే మూలుగుతున్నాయి. విచారణ పేరుతో కాలయాపన చేయడం, సాంకేతిక కారణాలు చెప్పి దరఖాస్తులను తిరస్కరించడం అధికారులకు పరిపాటిగా మారింది. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బంది అవినీతి అవతారమెత్తిన ꠸అప్రూవల్꠸ కొందరు అధికారులు, సిబ్బంది పేదవాడి ఆకలిని పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. అర్హత ఉ న్నా సరే, రేషన్ కార్డు ఆమోదం పొందాలంటే మధ్యవర్తుల ద్వారా వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ꠸꠸డబ్బులు ఇస్తేనే పని జరుగుతుందని లేదంటే ఫైల్ పెండింగ్‌లో ఉంటుందనే ధోరణి ఎమ్మార్వో ఆఫీసుల్లో బహిరంగ రహస్యంగా మారింది. లంచం ఇచ్చుకోలేని నిరుపేదలు ప్రభుత్వ పథకాలకు దూరమై తీవ్రంగా నష్టపోతున్నారు. కార్యాలయానికి వెళ్లిన ప్రజలకు అధికారులు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు. సర్వర్ డౌన్ అని ఒకరు, పై అధికారులు ఇంకా ఆదేశాలు ఇవ్వలేదని ఒకరు తమ దగ్గర ఏమి పెండింగ్ లేదు అంతా జిల్లా స్థాయిలోనే ఉందని మరొకరు సాకులు చెబుతూ తమ బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల గురించి మాట్లాడటం తప్ప, క్షేత్రస్థాయిలో ఒక నిరుపేదకు రేషన్ కార్డు ఎందుకు అందడం లేదన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డు కేవలం బియ్యం కోసమే కాదు, అది ఒక నిరుపేద కుటుంబానికి ఆరోగ్య శ్రీ , ఇతర ప్రభుత్వ పథకాలకు ప్రధాన ఆధారం. కార్డు మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరుతాయని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

## సోషల్ మీడియాతో పిల్లల్లో ఏకాగ్రత లోపం!

### తాజా అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, : సోషల్ మీడియాపై గంటల తరబడి గడిపే పిల్లల్లో మానసిక ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు దెబ్బతింటున్నాయని, ఏకాగ్రత లోపిస్తున్నదని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. అమెరికా వ్యాప్తంగా పిల్లలపై జరిగిన ఓ అధ్యయనం ప్రకారం, స్మార్ట్‌ఫోన్‌పై తరుచూ స్క్రోలింగ్, నోటిఫికేషన్‌లను చూస్తూ గడపటం.. పిల్లల్లో 'ఏడీహెచ్‌డీ' వంటి లక్షణాల్ని (చంచల స్వభావం, పనిపై శ్రద్ధ లేకుండుట) పెంచుతున్నదని పరిశోధకులు గుర్తించారు. అమెరికాలో సగటున ప్రతి పిల్లాడు టీవీ, ఆన్‌లైన్ వీడియోలపై రోజూ సగటున 2.3 గంటలు, సోషల్ మీడియా కోసం 1.4 గంటలు, వీడియో గేమ్స్‌పై 1.5 గంటలు గడుపుతున్నాడట. అయితే ఇందులో సోషల్ మీడియా ఒక్కటే పిల్లల ఏకాగ్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అన్ని రకాల 'స్క్రీన్ టైమ్' పిల్లలపై ఒకేవిధమైన ప్రభావం చూపటం లేదన్న విషయం వీరి పరిశోధనలో తేలింది. స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, యూఎస్‌కు చెందిన ఒరేగావ్ హెల్త్, సైన్స్ వర్సిటీ పరిశోధకులు సం యుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

## తెరుచుకోనున్న ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్




కాకినాడ, : కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.. వాకలపూడి సెజ్‌లో ఉన్న రిఫైనరీ ప్లాంట్‌ను మూసివేస్తున్నట్లు కార్మి కులకు సమాచారం ఇచ్చారు. అలాగే కలెక్టర్‌తో పాటుగా ఇతర శాఖల అధికారులకు మెయిల్ ద్వారా తెలిపారు. నష్టాలు రావడంతో కంపెనీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. యూనిట్ ప్రారంభిం చిన దగ్గర నుంచి వరుసగా ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయని చెబుతున్నారు. విదేశాల నుంచి ముడి చక్కెర ఈఐడీ ప్యారీ కంపెనీ అనుబంధ సంస్థ పీఎస్ఆర్ఐపీఎల్ (ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్) ప్లాంట్‌కు దిగుమతి అయ్యేది. ఈ ముడి చక్కెరను ప్లాంట్2లో శుద్ధి చేసి మళ్లీ ఎగుమతి చేసేవారు. ఈప్లాంట్ ప్రారంభిం చినప్పటి నుంచి ఇబ్బందుల్ని ఎదురవుతు న్నాయి. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రూ.1406 కోట్ల నష్టాలు వచ్చాయి.

ఈ క్రమంలో మార్చి 31న కంపెనీ బోర్డు సమావేశంలో ప్లాంట్ మూసివేయాలని డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు, పరిశ్రమలు, ఇతర శాఖలకు సమాచారం ఇచ్చారు.. ప్లాంట్‌కు కాంట్రాక్ట్ కార్మికులు రావొద్దని చెప్పారు. వాకలపూడి సెజ్‌లో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన యూనిట్‌ను ప్రారంభించారు. ముందు ఈ ప్లాంట్‌ను గ్యాస్‌తో నడిపించాలని ప్లాన్ చేసినా.. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో బొగ్గుతో నడిపించాల్సి వచ్చింది.. ఈ మౌలిక సదుపాయాల కోసం అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

2015–2016లో ఈ యూనిట్‌లో ప్రొడక్షన్ మొదలైంది.. ప్రారంభంలో రోజుకు రెండే వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉంటే.. దానిని 3వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని భావించారు.కానీ మూడు వేల మెట్రిక్ టన్నులకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.. ఆర్థికంగా కూడా నిలదొక్కుకోలేకపోయారు.

అలాగే పలు కారణాలతో 2021నుంచి 2022 వరకు రెండు నెలల పాటూ ప్లాంట్‌లు పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత 2022 నుంచి 2023లో వరుసగా ప్రమాదాలు జరిగాయి. దీంతో ప్లాంట్ నునెల రోజులకు పైగా మూసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. షిప్పుల్లోకి లోడింగ్ కూడా ఆలస్యం కావడంతో భారీ జరిమానాలు చెల్లించడం ఇబ్బందిగ మారింది. వీటికి తోడు మార్కెట్‌లో చక్కెర ధరలు కూడా తగ్గడంతో మరిన్ని నష్టాలు వచ్చాయి.

ఓవైపు రుణభారం కూడా పెరగడంతో యూనిట్‌ను నడపడం లాభదాయకం కాదని భావించారు. అందుకే ఈయూనిట్‌ను మూసి వేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం మీద నష్టాల కారణంగా కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.

## పక్కా వ్యూహాలతో తమ్ముళ్లు..



విజయవాడ: తెలుగుదేశం పార్టీ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు అటాక్ అనేది ఆ పార్టీ స్ట్రాటజీ కాదు. రాజకీయ విమర్శలు వస్తే దానికి ధీటైన కౌంటర్ ఇవ్వడమే ఆ పార్టీ నేతలు చేసే పని. కానీ ఇటీవల పరిణామాలు చూస్తుంటే మాత్రం ముందే టిడిపి మంత్రులు అటాక్ చేయడం చూస్తుంటే మాత్రం ప్రత్యేక వ్యూహం ఉన్నట్టు అర్థమవుతుంది. జగన్ మావిగన్ రాజధాని ప్రతిపాదన తర్వాత రకరకాలుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. సరిగ్గా అదే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెనాయు డు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సెగలు పుట్టించాయి. అయితే ఆయన ఒక్కడే కాదు. ఆ తరువాత మంత్రి పయ్యావుల కేశవ్. అటు తరువాత మంత్రి వంగలపూడి అనిత, చివరకు నిమ్మలరామానాయుడు.. ఇలా అంతా వరుసగా మీడియా ముందుకు వచ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా టిడిపి మంత్రులు ఈ తరహా అటాక్ చేయడం వైసీపీకి నిద్ర పట్టడం లేదు.సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువగా కౌంటర్ అటాక్ ఉంటుంది. దీనిపైనైనా మూకుమ్మడి దాడి ఆ పార్టీ పుణ్యమే. అది వారికి అలవాటైన విద్య కూడా. కానీ టిడిపి మాత్రం అలాంటి విమర్శలు వచ్చినప్పుడు వాటికి సమాధానం చెప్పడమే. అదేపనిగా దానిని లాగి బయటకు ప్రచారం చేయడం ఉండదు. కానీ ఫస్ట్ టైం టిడిపి మంత్రులు అటాక్ చేయడం ప్రారంభించారు. తండ్రి అధికారం కోసం జగన్మోహన్ రెడ్డి ఎంత ఆరాటపడ్డారు.. ప్రస్తుతం వైసీపీలో ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పై ఏవిధంగా మాట్లాడారు అన్న విషయాలను గుర్తు చేస్తూ అచ్చెనాయుడు చేసిన కామెంట్స్ ఏపీ పొలిటికల్ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి. తరువాత అదే స్థాయిలో మాట్లాడారు పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత. చివరకు నిమ్మల రామానా యుడు మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా హత్య గురించి ప్రస్తావిస్తూ వైసిపి పై విమర్శలు చేశారు.అయితే ఈ మొత్తం పరిణామాలతో మావిగన్ రాజధాని ప్రతిపాదన హైలెట్ అయింది. దానికి వ్యతిరేక ప్రచారం తోడైంది. వాస్తవానికి మావిగన్‌పై వచ్చిన వ్యతిరేకతను.. అనుకూలంగా మార్చుకునేందుకువైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. మూడు నెలల పాటు దానికి టార్గెట్ పెట్టుకుంది. అదే పనిగా మావిగన్ ప్రచారం చేస్తే ప్రజల్లో క్రమేపి సానుకూలత వస్తుం దని అంచనా వేసింది.కానీ ఈ విషయాన్ని గుర్తించిన టిడిపి మంత్రు ల ద్వారా కౌంటర్‌ఇచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది.అలా ఆ కౌంటర్ పతాక స్థాయికి తీసుకెళ్లింది. మావిగన్ పై సోషల్ మీడియా లో ప్రచారం చేస్తామనుకున్న వైసీపీ ఆశలను గండి కొట్టింది. పక్కా వ్యూహంతోనే టిడిపి మంత్రుల కౌంటర్ అటాక్ అని అర్థమైంది.

## మురుగు నీటికి ఫుల్ డిమాండ్

హైదరాబాద్, : వ్యర్థ జలాల పునర్వినియోగం కోసం హైదరాబాద్ జలమండలి వినూత్న కార్యక్రమానికి రెడీ అయింది. గేటెడ్ కమ్యూనిటీల నుంచి శుద్ధి చేసిన మురుగునీటిని ఒక్కో ట్యాంకర్‌కు రూ.50–రూ.100 చెల్లించి సేకరించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'ఎరుపు రంగు' ట్యాంకర్లను కేటాయించింది.

సేకరిం చిన నీటిని నిర్మాణాలు, పరిశ్రమలు, పార్కుల నిర్వహణకు వాడడం ద్వారా తాగునీటిపై ఒత్తిడిని తగ్గించాలని జలమండలి అధికారులు భావిస్తు న్నారు.సాధారణంగా ప్రజలు జలమండలి నుంచినీటిని కొనుగోలు చేయడం మనకు తెలుసు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో వేసవి తాపం మెదలవుగా.. భూగర్భ జలాలు అడుగంటి పోవటం తో నీటికి డిమాండ్ పెరిగింది.

భారీగా ట్యాంకర్లు బుక్ చేస్తున్నారు. కానీప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. గేటెడ్ కమ్యూ నిటీలలోని ప్రైవేట్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లద్వారా శుద్ధి చేసిన నీటిని జలమండలి తిరిగి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో ట్యాంకర్ నీటికి రూ.50 నుంచి రూ.100 వరకు చెల్లించేందుకు బోర్డు రెడీ అయింది.

హైదరాబాద్ లోని వివిధ గేటెడ్ కమ్యూనిటీలలో రోజుకు దాదాపు 200 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. ఇందులోతక్కువ నీటినిమాత్రమే గార్డెనింగ్, ఫ్లషింగ్ కోసం వాడుతు ండగా.. మెజారిటీ నీరు నాలాల ద్వారా కుంటలు, చెరువుల్లోకి వృథాగా కలిసిపోతోంది. ఈ వృథాను అరికట్టి ఆ నీటిని పునర్వినియోగంలోకి తీసుకురావ డమే లక్ష్యంగా జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. శుద్ధి చేసిన ఈ గ్రే వాటర్ సేకరణ కోసం జలమండలి ప్రత్యేకంగా రెడ్ కలర్ ట్యాంకర్లను ప్రవేశపెట్టనుంది. తాగే నీటి సరఫరా కోసం ప్రస్తుతం బ్లూ రంగు ట్యాంకర్లు వాడుతున్నారు. శుద్ధి చేసిన మురుగునీటి కోసం ఎరుపు రంగు ట్యాంకర్లను కేటాయించారు. గేటెడ్ కమ్యూనిటీలు తమ వద్ద ఉన్న నీటిని విక్రయించడానికి జలమండలిని సంప్రదిస్తే.. ఖాళీ ట్యాంకర్ నేరుగా వారి వద్దకు పంపి నీటిని సేకరించనున్నా రు.సేకరించిన నీటి నాణ్యతను పరీక్షించిన తర్వాత.. దానిని తాగేందుకు కాకుండా ఇతర అవసరాలైన భవన నిర్మాణాలు, లాండ్‌స్కేపింగ్, గోల్ఫ్ కోర్స్ నిర్వహణ, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం నగరంలో శుద్ధి చేసిన నీటిలో 2 శాతం కంటే తక్కువే వాడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

ఈ కొత్త వాటర్ బ్యాంక్ ద్వారా దీనిని 2000 ఎంఎల్డీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నా మని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన మూడు ట్యాంకర్లతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌ను బట్టి వీటి సంఖ్యను పెంచనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన ఒక సంస్థ ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు వివరించారు ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో నీటి డిమాండ్ పెరిగిందన్నారు.

గతేడాదిలో 2.1లక్షల ట్యాంకర్ల వినియోగం ఉంటే.. ఈ ఏడాదిఆ సంఖ్య2.24 లక్షలకు చేరుకుందన్నారు. ప్రతిరోజూ సరాసరి 7500ట్యాంకర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డొమస్టిక్ ట్యాం కర్ రూ.500, కమర్షియల్ అయితే రూ.850 చొప్పున వసూలు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

# బన్నీ 'రాకా'లో బాలీవుడ్ బాద్‌షా?



'పుష్ప'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసిన చిత్రబృందం ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వార్తతో చర్చల్లో నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఓ కీలక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతంలో షారుక్ ఖాన్‌తో అట్లీ తీసిన 'జవాన్' చిత్రం భారీ విజయం సాధించింది. వీరిద్దరి మధ్య ఉన్న మంచి అనుబంధం కారణంగానే 'రాకా'లో అతిథి పాత్రకు షారుక్ అంగీకరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రచారానికి ఇది మరింత బలం చేకూరుస్తోంది. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ సరికొత్త అవతారంలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఈ లుక్ కోసం ఆయన రోజూ 3 నుంచి 4 గంటల సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ విషయంలోనూ పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రధానంగా దీపికా పదుకొణె పేరు బలంగా వినిపిస్తుండగా, రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ముంబైలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నటీనటుల పూర్తి వివరాలపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# విశ్వంభర'లో అవనిగా త్రిషా



చిరంజీవి నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్,వంశీ,ప్రమోద్ నిర్మిస్తున్నారు. పోస్ట్-ప్రొడక్షన్ పనులు చివరి దశలోఉన్న ఈ చిత్రం విడుదలకు దగ్గరవుతోంది. విడుదల చేసిన స్పెషల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో 'అవని' పాత్ర పోషించిన హీరోయిన్ త్రిషా కృష్ణన్ చిత్ర బృందం ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో సాంప్రదాయ దుస్తులలో వెలుగుతున్న దీపాల పళ్ళెం పట్టుకుని త్రిష ఎంతో అద్భుతంగా కనిపిస్తోంది. గోల్డ్ కలర్ బ్యాక్‌డ్రాప్ పోస్టర్‌కు పండుగ వాతావరణాన్ని జోడించింది. దర్శకుడు వశిష్ట విజువల్ వండర్, మాస్ అప్పీల్ మేళవించి 'విశ్వంభర'ను అద్భుతంగా తీర్చిదిద్దు తున్నారు. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ముఖ్య పాత్రలలో నటిస్తుండగా, మౌని రారు ఒక స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఈ సినిమా త్వరలోనే థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి రచన-దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, సంగీతం: ఎంఎం కీరవాణి, భీమ్స్ సిసిరోలియో, డీఓపీ: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్.

# 'కల్కి-2'లో జెడి కీలక పాత్ర..!



'కల్కి-2'లో కీలక పాత్ర.. జెడి చక్రవర్తి రియాక్షన్ ఇదే..! ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. కలెక్షన్ల సునామీ సృష్టించింది. అయితే ఈ సినిమాకి త్వరలో సీక్వెల్ రాబోతోంది. ఈ సీక్వెల్‌కి సంబంధించి ఓ ఆసక్తికర వార్త ఇప్పుడు సోషల్‌మీడియాను షేక్ చేస్తోంది. తొలి భాగంలో చాలా మంది నటీనటులు, దర్శకులు ప్రత్యేక పాత్రలో కనిపించారు. దీంతో సీక్వెల్‌లో కూడా చాలా కామియోలు ఉండే అవకాశం ఉంది. అందులో నటుడు జెడి చక్రవర్తి ఓ ప్రత్యేక పాత్రలో కనిపిస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి..అయితే ఈ సినిమాకి త్వరలో సీక్వెల్ రాబోతోంది. ఈ సీక్వెల్‌కి సంబంధించి ఓ ఆసక్తికర వార్త ఇప్పుడు సోషల్‌మీడియాను షేక్ చేస్తోంది. తొలి భాగంలో చాలా మంది నటీనటులు, దర్శకులు ప్రత్యేక పాత్రలో కనిపించారు. దీంతో సీక్వెల్‌లో కూడా చాలా కామియోలు ఉండే అవకాశం ఉంది. తానుఈ సీక్వెల్‌లో నటించడం లేదని స్పష్టం చేశారు. అయితే ఈ వార్తలు విని ఎంజాయ్ చేశానని.. అందులో ఏ మాత్రం నిజం లేదన పేర్కొన్నారు. దీంతో ఈ రూమర్‌కి చెక్ పడింది.

# మృణాల్‌తో సినిమా అంటే హీరోలు జాగ్రత్తగా ఉండాల్సిందే!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌తో సినిమాలు చేసేహీరోలు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే, సెంటిమెంట్ అలా నడుస్తుంది.ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ పేరు ఇండస్ట్రీ వర్గాల్లో ఎలా వినిపిస్తుందో తెలిసిందే. రీసెంట్‌గా ధనుష్ తో పెళ్లి అంటూ ఆమెపైవార్తలు వచ్చాయి. ఆ వార్తలకి ఎలాగోలా స్టాప్ పెట్టిన మృణాల్.. ఇప్పుడు తన సినిమాలతో చర్చల్లో నిలుస్తున్నారు.
ఈ సినిమా ప్రమోషన్స్‌లో మృణాల్ యమా యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. అలా ఓ ఈవెంట్‌లో తెలుగు హీరోనే పెళ్లి చేసుకుంటుందని, మృణాల్‌పై అల్లు అరవింద్ చేసిన కామెంట్స్ బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో తెలుగు ప్రేక్షకులు ఆమెపై ఇంకాస్త ఇంట్రెస్ట్ పెడుతున్నారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమాలో స్పెషల్ సాంగ్‌కుఈ అందాల భామ సెలక్ట్ అయినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, తాజాగా తన సినిమాల్లోని ఒక వింత సెంటిమెంట్ గురించి ఈ భామ బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ..తన స్నేహితులు తనను సరదాగా 'హస్బెండ్ మర్డరర్' (భర్తలను చంపేసే భార్య) అని ఆటపట్టిస్తుంటారని నవ్వుతూ చెప్పింది. అందుకు కారణం ఆమె నటించిన వరుస సినిమాలు, అందులో హీరోలపాత్రల ముగింపేనని అంటోంది. ఆ వివరాల్లోకి వెళితే.. హిందీ'జెర్సీ' సినిమాలో షాహిద్ కపూర్ పాత్ర చివరికి చనిపోతుంది. 'సీతారామం' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీలో కూడా దుల్కర్ సల్మాన్ పాత్ర ప్రాణాలు విడుస్తుంది. అలాగే 'ధమాకా'లో కార్తీక్ ఆర్యన్ పాత్ర కూడా అంతే! ఇక తాజాగా విడుదలైన 'డెకాయిట్' సినిమాలో కూడా హీరో అడవి శేష్ పాత్రకు ఇదే గతి పట్టింది. "సీతారామంలో రామ్ చనిపోయా రు.. ఇప్పుడు అడవి శేష్ పాత్ర కూడా అంతే! నా సినిమాల్లో హీరోలందరినీ ఇలా చంపేస్తున్నందుకు నా ఫ్రెండ్స్ నన్ను ఆటపట్టిస్తున్నారు" అంటూ మృణాల్ సరదాగా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోకు నెటిజన్లు కూడా సరదాగా రియాక్ట్ అవుతున్నారు. మృణాల్‌తో కలిసి నటించే హీరోలు తమ పాత్రల విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకోవాలంటూ నెటిజన్లు చేసే కామెంట్స్‌తో ఈ వీడియో బాగా చక్కర్లు కొడుతోంది.

# 'భోగి'లోకందుల సులోచన రాణిగా అనుపమ పరమేశ్వరన్



హీరో శర్వానంద్, దర్శకుడు సంపత్ నంది కాంబోలో రూపొందుతున్న పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ సినిమా 'భోగి'. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. తాజాగా మేకర్స్ అనుపమ పరమేశ్వరన్ పాత్రను పరిచయం చేస్తూ కందుల సులోచన రాణిగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అనుపమ పల్లెటూరి యువతిగా సహజసిద్ధమైన లుక్‌లో కనిపిస్తుంది. మోదుగ ఆకులుతో ఆకుపళ్లెంతయారు చేస్తూ జీవనం సాగించే సులోచన పాత్రలో అ నుపమపూర్తిగా లీనమయ్యారు. ప్రకృతితో ముడిపడి ఉన్న ఈ పా త్రలో ఆమె సహజత్వం, ధైర్యం, బలం ప్రతిబింబిస్తున్నాయి. గంగా అనే తుఫాన్‌లాంటి పాత్రకు ఆత్మలా నిలిచే సులోచన ఈ కథలో కీలక పాత్రగా ఉండనుంది. అడవుల్లో హై-ఇంటెన్సిటీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించారు. త్వరలో హైదరాబాద్ పరిసరాల్లో నెక్స్ట్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో డింపుల్ హయాతి మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. 1960ల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో సాగే ఈ కథ యాక్షన్, భావోద్వేగాలతో నిండిన పీరియడ్ డ్రామాగా రూపొందుతోంది.భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రం రక్షా బంధన్ సందర్భంగా ఆగస్టు 28న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'హౌస్ ఆఫ్ ఫన్'లో కీర్తి సురేష్



నగరం నడిబొడ్డున పచ్చని ప్రకృతి ఒడిలో వ్యక్తిగత జ్ఞాపకాలు, వినూత్న కళాఖండాల కలయికతో నటి కీర్తి సురేష్ తన ఇంటిని ఒక అద్భుత ప్రపంచంగా తీర్చిదిద్దుకున్నారు. పదిహేనేళ్ళ ప్రేమ ప్రయాణానికి ప్రతీకగా నిలిచే ఈ 'హౌస్ ఆఫ్ ఫన్' విశేషాలు 'ఏషియన్ పెయింట్స్-వేర్ ద హార్ట్ ఈజ్' సీజన్ 9, రెండో ఎపిసోడ్‌లో ఆమె మనతో పంచుకున్నారు. ఈ ఇంటికి వారు 'హౌస్ ఆఫ్ ఫన్' అని పేరు పెట్టుకున్నారు. అపార్ట్‌మెంట్ పై అంతస్తులో ఉన్న ఈ నివాసం నుంచి చుట్టూ ఉన్న ప్రకృతిని ఆస్వాదించవచ్చు. 'కలిసి ఒక ఇల్లు నిర్మించుకోవడం అనేది ఒక అద్భుతమైన అనుభూతి.మాకు అన్నింటికంటే ముఖ్యమైనది సౌకర్యం' అని కీర్తి ఈసందర్భంగా పేర్కొన్నారు. గోడపై నిలువుగా ఉన్న రెండు కాన్వాస్ పెయింటింగ్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. అందులో ఒకటి వారు ప్రేమించుకోవడం మొదలుపెట్టిన రోజు నాటి చంద్రుడి ఆకారం కాగా మరొకటి సరిగ్గా 15 ఏళ్ల తర్వాత వారి వివాహం జరిగిన రోజునాటిది. తన పెళ్లిజ్ఞాపకాలను పంచుకునే క్రమంలో కీర్తి సహజంగానే మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో మాట్లాడుతూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఈ ఇల్లు కేవలం ఒక కట్టడంలా కాకుండా వారి 15 ఏళ్ల ప్రయాణానికినిలువుటద్దంలా కనిపిస్తోంది.ఈ ఇంటి రూపకల్పనలో రంగులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ప్రకాశవంతమైన డెకర్, ఫర్నిచర్, ఛాయాచిత్రాలు, పచ్చని రంగులు ఆ ప్రదేశానికి జీవం పోస్తుంటే నలుపు-తెలుపు ఫ్లోర్ టైల్స్ ఇంటికి సమతుల్యతను, ప్రశాంతతను అందిస్తాయి. కీర్తి సురేష్ జాతీయ అవార్డు గెలుచుకున్న

# 'ప్యారడైజ్' కోసం రెండేళ్లు అంకితం..



తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో "బాహుబలి" వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న "ప్యారడైజ్" సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి.ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ "ప్యారడైజ్" ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది.నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.
గతంలో "సైజ్ జీరో" కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. "ప్యారడైజ్" విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.